


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 247 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 29 మే 2026 | పేజీలు : 12 | వెల : 2/-


# జై కార్యకర్త.. జై జై కార్యకర్త



- 2029 ఎన్నికలకు సిద్ధం కావాలి... ప్రతి ఎన్నికల్లోనూ గెలవాలి... మళ్లీ మళ్లీ ఎన్డీఏ రావాలి
- గొడ్డలి పార్టీకి అధికారం పోయినా అహంకారం పోలేదు
- విధ్వంసం సృష్టించేందుకు గొడ్డలి పార్టీకి ఏడు విభాగాలు
- మహిళలకు 33 శాతం సీట్లిస్తాం... జెన్-జీ, జెన్-అల్ఫాకు అవకాశాలిస్తాం
- డబ్బు పోతే సంపాదించుకోగలం... క్యారెక్టర్ పోతే కోలుకోలేం
- వెనుకబడిన వర్గాలను ముందుకు తీసుకెళ్తాం... బడుగులకు అండగా ఉంటాం
- సిగ్గు లేకుండా మెగా డీఎస్సీ నిర్వహణపై ఆరోపణలా...?
- సీఎం అంటే కామన్ మ్యాన్ అనేలా పాలన
- మహానాడులో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు
- రెండు రోజుల మహానాడుకు 24.5 లక్షల మంది హాజరు
- క్లస్టర్ల వారీగా డిజిటల్ మహానాడు నిర్వహణతో క్షేత్ర స్థాయిలో కన్పించిన మహానాడు సందడి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :**

జై కార్యకర్త... జైజై కార్యకర్త అంటూ మహానాడు వేదికగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నినదించారు. రెండు రోజుల మహానాడు ఆసాంతం కార్యకర్తే అధినేత అనే అంశాన్ని అడుగు అడుగునా ప్రతిబింబించేలా నడిచింది. మహానాడు రెండు రోజుల కార్యక్రమంలో జరిగిన ప్రసంగాల్లోనూ ఇదే ప్రతిఫలించింది. కార్యకర్తను మరిచిపోవద్దు అంటూ స్వయంగా చంద్రబాబు నేతలకు దిశా నిర్దేశం చేశారు. కేడర్.. కేడర్.. కేడర్.. ఇదే తారక మంత్రం కావాలని చంద్రబాబు స్పష్టం చేశారు. గురువారం రెండో రోజు మహానాడు సందర్భంగా సీఎం చంద్రబాబు ముగింపు ఉపన్యాసంలో వివిధ కీలకాంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడుతూ..."వర్చువల్ మహానాడు విజయవంతమైంది. అదరగొట్టింది. అత్యద్భుతంగా మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించాం. రాష్ట్ర వ్యాప్తంగా 1,875 క్లస్టర్లతో పాటు 12 దేశాల నుంచి కార్యకర్తలు, నేతలు హాజరయ్యారు. ఈ రెండు రోజుల మహానాడులో ఏకంగా 24.5 లక్షల మంది హాజరు కావటం ఓ రికార్డు. రికార్డులు సృష్టించడం, వాటిని తిరగరాయడం టీడీపీకి మాత్రమే సాధ్యం. కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని ఆచరిస్తూ ఈ మహానాడులో వారికి భాగస్వామ్యం కల్పించాం. ఆకాశమే హద్దుగా పార్టీలో కార్యకర్తలు ఎదిగేందుకు అవకాశాలు కల్పించాం. నేతలు, కార్యకర్తలను చూసి నేను కూడా పోటీ పడే పరిస్థితి వచ్చింది. శాశ్వతంగా పార్టీని మోసింది, మోసేది, మోయబోయేది కార్యకర్తలే. వారందరికీ పాదాభివందనం. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్ల మేర ఖర్చు చేశాం. నాపై కార్యకర్తలు, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తున్నాను. టీడీపీ కుటుంబ సభ్యులకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటాను. కార్యకర్తల బిడ్డలకు విద్య, సాధికారత, నైపుణ్యం లాంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సోషల్ రీ ఇంజనీరింగ్ ద్వారా విస్తృత అవకాశాలు కల్పిస్తున్నాం, బూత్ కమిటీలు, యూనిట్లు, క్లస్టర్ల వరకూ మిగతా .. 2లో..

### ఎన్టీఆర్ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం

## అన్న క్యాంటీన్లు నిర్వహిస్తోంది

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పవన్ కల్యాణ్ నివాళి



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామా రావు (ఎన్టీఆర్) జయంతి సందర్భంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు ఘనంగా నివాళు లర్పించారు. కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా పక్షాన నిలిచిన గొప్ప నేత ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ఆయన ప్రవేశపెట్టిన 'రెండు రూపాయలకే కిలో బియ్యం' పథకం చారిత్రాత్మకమైనదని గుర్తుచేశారు. ఎన్టీఆర్ చూపిన అదే స్ఫూర్తితో ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'అన్న క్యాంటీన్ల'ను నిర్వహిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. పేదలకు అండగా నిలవాలన్న ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళుతున్నామని తన సందేశంలో స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళులు అర్పిస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.

### యువతను నైపుణ్యం కలిగిన

## మానవ వనరులుగా తీర్చిదిద్దుతాం

రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి - వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి
సోషల్ మీడియాలో ఫేక్ కంటెంట్ పట్ల అప్రమత్తంగా ఉండాలి - టీడీపీ కేంద్ర కార్యాయంలో జెన్-జీతో మంత్రి లోకేష్ ఆత్మీయ భేటీ



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** యువత అంకితభావం, సమష్టి కృషి, త్యాగం అలవర్చుకోవాలని టీడీపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మహానాడు సందర్భంగా జెన్-జీతో నారా లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యువత అభిప్రాయాలు తెలుసుకున్నారు. జెన్ జీ ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు.

**వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి**

రాష్ట్రానికి ఏఐ, క్వాంటం టెక్నాలజీలు వస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా కరిక్యులమ్ లో మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఉన్నత విద్యలో ఇప్పటికే పెద్దఎత్తున సంస్కరణలు తీసుకువచ్చాం. పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం కోసం ప్రజాప్రభుత్వం క్లస్టర్ బేస్డ్ విధానంతో ముందుకు వెళ్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించాం. డేటా, ఐటీ, క్వాంటం, రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో రెన్యూవబుల్ ఎనర్జీ వంటి క్లస్టర్లు ఏర్పాటుచేస్తున్నాం. ఒకేచోట ప్రధాన పరిశ్రమలతో పాటు అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లను నెలకొల్పడం ద్వారా ఎకోసిస్టమ్ నిర్మిస్తున్నాం. పరిశ్రమలకు అవసరమైన మానవ వనరుల కోసం స్కిల్ డెవలప్ మెంట్ పై ప్రత్యేక దృష్టిసారించాం. రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, రిలయన్స్ వంటి సంస్థలు పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నాయి. వచ్చిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి. యువతను నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దుతాం. ఒకే రాష్ట్రం, మిగతా .. 2లో..

### జగన్ పీఏ కేఎన్ఆర్ నివాసంలో

## సిట్ తనిఖీలు

విజయవాడలోని నివాసంలో తనిఖీలు, సిట్ ఆఫీసులో కొనసాగుతున్న విచారణ
కేఎన్ఆర్ భార్య పేరిట భారీగా ఆస్తులు, బ్యాంకు డిపాజిట్లు ఉన్నట్టు గుర్తింపు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఇందులో భాగంగా వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కె.నాగేశ్వరరెడ్డి (కేఎన్ఆర్) నివాసంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం తనిఖీలు చేపట్టింది. మద్యం లావాదేవీలకు సంబంధించి విజయవాడలోని ఆయన నివాసంలో అధికారులు సోదాలు మిగతా .. 2లో..

### ప్రార్థనా మందిరాల మైకులపై

## రఘురామ సీరియస్

ప్రజలకు కీలక సూచన



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు, ప్రార్థనా మందిరాల వద్ద లౌడ్‌స్పీకర్ల వల్ల కలిగే శబ్ద కాలుష్యంపై తన పోరాటాన్ని ఉద్ధృతం చేశారు. రాష్ట్రంలో ఎక్కడైనా ప్రార్థనా మందిరాల వద్ద మైకుల మోత ఎక్కువగా ఉంటే, వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఫిర్యాదు ఎలా చేయాలో వివరిస్తూ ఒక నమూనా ఫారమ్‌ను కూడా విడుదల చేశారు. ఫిర్యాదు చేసిన 10 రోజులలోపు పోలీసులు చర్యలు తీసుకోకపోతే, ఆ ఫిర్యాదు కాపీతో పాటు సంబంధిత మిగతా .. 2లో..

### పవన్ వల్లే ఉద్యోగం, భూమి..

## ఆ లాజిక్ ఎలా మిస్ అయ్యారు?



సుగాలి ప్రీతి తల్లికి హైపర్ ఆది సూటి ప్రశ్న

**విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలు జిల్లాకు చెందిన సుగాలి ప్రీతి కేసు వ్యవహారం ఏపీ రాజకీయాల్లో మరోసారి దుమారం రేపుతోంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై సుగాలి ప్రీతి తల్లి చేసిన విమర్శలకు మిగతా .. 2లో..

## జైలు నుంచి విడుదలైన పాస్టర్ అభినయ్ దర్శన్



తాను గాయపడిన సింహాన్ని అంటూ దర్శన్ వ్యాఖ్యలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** తనపై తానే దాడి చేయించుకుని మతాల మధ్య విద్వేషాలను రేకెత్తించేందుకు యత్నించాడనే ఆరోపణతో అరెస్ట్ అయిన క్రైస్తవ మత ప్రచారకుడు అభినయ్ దర్శన్ నర్సీపట్నం సబ్ జైలు నుంచి విడుదలయ్యారు. 8 రోజుల పాటు జైల్లో ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. జైలు నుంచి విడుదల అయిన తర్వాత ఆయన ఆసక్తికర విషయాలను మిగతా .. 2లో..

### చంద్రబాబు బూట్లు

## ఎప్పుడు తుడుస్తావ్?

కొడాలి నానికి వెనిగండ్ల రాము ప్రశ్న




**గుడివాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి, వైసీపీ నేత కొడాలి నానిపై టీడీపీ గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. ఎన్నికల్లో చంద్రబాబు గెలిస్తే ఆయన బూట్లు తుడుస్తానని కొడాలి నాని అన్నారని... ముందు చంద్రబాబు బూట్లూ తుడిచిన తర్వాతే కొడాలి నాని రాజకీయాల గురించి మాట్లాడాలని అన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కొడాలి నాని కార్పొరేటర్ గా కూడా గెలవలేడని... ఇది తన సవాల్ అని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కొడాలి నానిని గుడివాడ ప్రజలు 53 వేల ఓట్లతో చిత్తుగా ఓడించారని... అయినా ఆయనకు బుద్ధి రాలేదని రాము మిగతా .. 2లో..

### మద్యం పాలసీ కేసుతో

## తనకు సంబంధం లేదన్న విజయసాయిరెడ్డి

ఏడున్నర గంటల పాటు విచారణ



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ మద్యం కుంభకోణం కేసులో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయ సాయిరెడ్డిని ఈడీ సుమారు ఏడున్నర గంటల పాటు విచారించింది. బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయం లో అధికారులు ఆయనను విచారించారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మద్యం పాలసీ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. తాను ఎవరి పేర్లను అధికారులకు మిగతా .. 2లో..

### పినరయి విజయన్ నివాసంలో

## ఈడీ సోదాలు

తీవ్రంగా స్పందించిన సీపీఐ రామకృష్ణ



**విశ్వం వాయిస్ న్యూస్ :** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నివాసంలో ఈడీ అధికారులు నిన్న సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం దేశ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. ఈ దాడులపై ఏపీ సీపీఐ నేత రామకృష్ణ తీవ్రంగా స్పందించారు. దాడులను ఖండించిన ఆయన... సోదాలు నిర్వహించిన అధికారులు ఒట్టి చేతులతోనే మిగతా .. 2లో..

### ఆ పొలాలను కొనుగోలు చేసిన తర్వాతే

## విద్యుత్ టవర్లు వేయండి

వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని



**కొత్తపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** హై ఓల్టేజ్ విద్యుత్ లైన్ల కారణంగా తమ భూములకు విలువ పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తెలిపారు. మచిలీపట్నం సమీపంలోని కొత్తపూడి గ్రామంలో పోర్టు కోసం విద్యుత్ టవర్ల కోసం అధికారులు మార్కింగ్ చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. ఈ రోజు ఆ గ్రామానికి వెళ్లిన పేర్ని నాని మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# జై కార్యకర్త.. జైజై కార్యకర్త

అందరికీ న్యాయం చేస్తున్నాం. ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ మా లక్ష్యం. నీతి నిజాయితీగా కార్యకర్తలు ఆర్థికంగా ఎదిగేలా నేను బాధ్యత తీసుకుంటాను. ప్రజల కోసం, పని చేసే కార్యకర్తల కోసం నేతలు కూడా పనిచేయాలి. పార్టీ కోసం, జెండా కోసం నేతలు, కార్యకర్తలు తమ ఆస్తులు అమ్ముకున్నారు. మెడపై కత్తి పెట్టినా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ ప్రాణం వదిలిన కార్యకర్తలే నాకు శిరోధార్యం."అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**రాష్ట్రం మీద గొడ్డలి వేటు పడకూడదు**

"రాష్ట్రంలో గొడ్డలి పార్టీ నేరాలు ఘోరాలు చేస్తోంది. రాజకీయాల్లో ఇలాంటి వాటిని నేను ఎప్పుడూ ఊహించలేదు. బాబాయిని హత్య చేసి నాచేతికే మరక అంటించే ప్రయత్నం చేశారు. గొడ్డలి పార్టీకి అధికారం పోయింది.. ప్రతిపక్ష హోదా పోయింది.. అయినా అహంకారం మాత్రం పోలేదు. కుట్ర, కుతంత్రాలు మాత్రం మానటం లేదు. దేశంలో ఏ రాజకీయ పార్టీకైనా యువత, రైతులు, మహిళలు ఇతర వర్గాలు విభాగాలుగా ఉంటాయి. కానీ గొడ్డలి పార్టీకి గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్, సోషల్ మీడియా సైకోల బ్యాచ్, ఫేక్ ప్రచారాల కోసం పేటీఎం బ్యాచ్, హత్యా రాజకీయాల కిరాయి హంతక బ్యాచ్, దేవాలయాలపై దాడి చేసే బ్యాచ్, కల్తీ లిక్కర్ బ్యాచ్ కూడా మరో విభాగంగా గొడ్డలి పార్టీకి ఉంది. ఇలా ఏడు విభాగాలు ఏర్పాటు చేసుకుని రాష్ట్రాన్ని విధ్వంసం చేసేందుకు కుట్రలు పన్నుతోంది. ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజలకు అర్థమయ్యే చెప్పడాన్ని ఎంత బాధ్యతగా తీసుకుంటారో... గొడ్డలి పార్టీ కుట్రలను ఎండగట్టే విషయంలోనూ అంతే బాధ్యత తీసుకోవాలి. గొడ్డలి పార్టీ కుట్రలను ప్రజలకు వివరించాలి... వాళ్లు చేసే నష్టాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలి. ఇవన్నీ చేయాలంటే పబ్లిక్‌తో కనెక్టివిటీ అనేది ముఖ్యం. వాళ్ల తప్పులను ఎండగడుతున్న సందర్భంలో మనం కూడా జాగ్రత్తగా ఉండాలి. ఏ స్థాయి వాళ్లకైనా క్యారెక్టర్ ముఖ్యం. మరక అంటకూడదు. ఎవరూ వేలెత్తి తప్పు పట్టని విధంగా నేతలు, కార్యకర్తలు పని చేయాలి. ప్రజా జీవితంలో ఉండే వాళ్లకు ఓపిక అవసరం. స్థానిక ఎన్నికల్లో మనం అంతా కలిసి సత్తా చాటాలి. ప్రతి ఎన్నికల్లో గెలవాలి. 2029 ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలు, నేతలు, కార్యకర్తలతో సమన్వయంతో పాటు సఖ్యతతో మెలగాలి. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, ఎన్డీఏ అగైన్ అండ్ అగైన్ అనేదే నినాదమే మనది కావాలి."అని టీడీపీ అధినేత పిలుపు ఇచ్చారు.

**గతంలో పరదాల పాలన... ఇప్పుడు ప్రజల మధ్య పాలన**

"గత ప్రభుత్వ నిర్వాకం వల్ల అన్ని వ్యవస్థలు విధ్వంసం అయ్యాయి. అన్నింటినీ గాడిన పెట్టి పని చేస్తున్నాం. ఆర్థిక పరిస్థితి సహకరించకున్నా ఇచ్చిన మాటను నిలబెట్టుకునేందుకు సంక్షేమం చేస్తూనే... అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నాం... పెట్టుబడులు తెస్తున్నాం. విభజన తర్వాత మనపై నమ్మకంతోనే రైతులు రాజధాని అమరావతి కోసం భూములిచ్చారు. గత పాలకులు ప్రజావేదికను కూల్చారు, పెట్టుబడులను తరిమేసి విధ్వంసం సృష్టించారు. వారు సృష్టించిన విధ్వంసంతో రాష్ట్రానికి పెట్టుబడిదారులు రావాలంటే భయపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చాక మళ్లీ ఏపీ బ్రాండ్ పునరుద్ధరించి విశ్వాసం కల్పించాం. అమరావతిని, పోలవరం ప్రాజెక్టు, స్టీల్ ప్లాంట్‌లను తిరిగి నిలబెట్టేందుకు కేంద్రం సహకారం అందించింది. వెంటిలేటర్‌పై ఉండే ఆర్థిక వ్యవస్థకు కేంద్ర సహకారంతో ఆక్సిజన్ ఇచ్చాం. ఇదేమీ సులువుగా అయిపోలేదు. గత పాలకులు చేసిన రూ.10 లక్షల కోట్ల అప్పు కారణంగా ఏపీ దివాలా తీసే పరిస్థితికి చేరుకుంది. వాటన్నింటినీ రీషెడ్యూలు చేసి అప్పుల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. రూ.12 వేల కోట్లతో మళ్లీ కేంద్ర పథకాలను పునరుద్ధరించాం. కుప్పకూలిన వ్యవస్థలన్నింటినీ సరిదిద్దాం. కేబినెట్ సమావేశాలు, ఎస్ఐపీబీ సమావేశాలు, కలెక్టర్ల సదస్సులు, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలతో పాటు పట్టాదారు పాస్ పుస్తకాల కోసం క్షేత్రస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాం. గతంలో పరదాల పాలన జరిగితే ఇప్పుడు ప్రజల మధ్య పాలన చేస్తున్నాం. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకం అందిందా లేదా అని తనిఖీ చేస్తున్నాం. సీఎం అంటే కామన్ మ్యాన్ అనే విధానంలో మా పాలన కొనసాగుతోంది. గూగుల్ లాంటి దిగ్గజ ఐటీ సంస్థ, ఆర్సెలార్ మిట్టల్ లాంటి సంస్థలు వచ్చాయంటే చాలా సంతోషం అనిపించింది. 23 నెలల్లోనే రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు తేగలిగాం. ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చేస్తున్నాం. సమాజమే దేవాలయం అన్న ఎన్టీఆర్ ఆశయాన్ని శిరోధార్యంగా భావించి అభివృద్ధి చేస్తున్నాం. ఆదాయం లేకుండా, అప్పులు చేసి సంక్షేమం చేయటం ఏమిటి? సంపద సృష్టించి సంక్షేమం ఇవ్వటమే టీడీపీ లక్ష్యం. మొదటి తేదీనే పెన్షన్, మహిళలకు స్త్రీశక్తి, తల్లికి వందనం, దీపం 2.0 లాంటి పథకాలను అందిస్తున్నాం. పేదల జీవన ప్రమాణాలు పెంచాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఆర్థిక అసమానతలు తగ్గించి ప్రతీ ఒక్కరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నదే ఆశయం. అందరికీ ఉద్యోగం, ఉపాధి కల్పించేలా పెట్టుబడి దారుల్లో నమ్మకాన్ని కల్పిస్తున్నాం. దేశంలోకి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఏపీకి 25 శాతం వచ్చాయి. సైనింగ్, గ్రౌండింగ్, ఓపెనింగ్ ఇలా అన్నిటికీ తేదీలు నిర్దేశించి ఒప్పందాలు చేసుకుంటున్నాం. కేవలం 36 రోజుల్లోనే 5వ తరం ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ప్రాజెక్టు ఏపీకి వచ్చిందంటే రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఎలా ఉందన్నది తెలుస్తోంది."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**సర్వతోముఖాభివృద్ధి దిశగా ఏపీ...**

"పోర్టులు, ఎయిర్ పోర్టులు వంటి మౌలిక సదుపాయాలతో పాటు పరిశ్రమలకు తగిన మానవ వనరుల్ని కూడా తయారు చేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. నైపుణ్యాల కల్పన కోసం దేశంతో పాటు అంతర్జాతీయంగా అత్యుత్తమ స్కిల్ డెవలప్మెంట్ సంస్థలను ఏపీకి తీసుకువస్తున్నాం. ఏఐ, క్వాంటం లాంటి అంశాల్లోనూ మన యువతకు పెద్ద ఎత్తున స్కిల్ డెవలప్మెంట్ చేస్తున్నాం. కోర్టుల్లో వేసిన కేసులను ఎదుర్కొని మెగా డీఎస్సీతో పాటు కానిస్టేబుళ్ల ఉద్యోగాలను కూడా ఇచ్చాం. అసాక్షి అనే అక్రమ పత్రిక ద్వారా మెగా డీఎస్సీపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారు. వారు చేస్తున్న కుట్రలు కుతంత్రాలు ఇక పని చేయవు. యువతలో అశాంతి సృష్టించే ప్రయత్నం చేస్తే దుష్ప్రచారం చేసిన వారిని నడి రోడ్డున నిలబెడతాం. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు. రాష్ట్రంలో నీటి భద్రత కోసం సాగునీటి ప్రాజెక్టుల కేలండర్ విడుదల చేశాం. రూ.40 వేల కోట్ల వ్యయంతో ఉత్తరాంధ్ర నుంచి రాయలసీమ వరకూ అన్ని ప్రాజెక్టులూ ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తాం. గోదావరి నుంచి కావేరి అనుసంధానం దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. గోదావరి నుంచి నల్లమల సాగర్‌కు నీటిని తరలించాలని ఆలోచన చేస్తున్నాం. భూమినే జలాశయంగా చేసుకుని పెద్ద ఎత్తున నీటిని నిల్వ చేసుకునేలా ప్రణాళికలు చేశాం. ప్రస్తుత ఎండా కాలంలోనూ రాష్ట్రంలోని రిజర్వాయర్లలో 65 శాతం నీటి నిల్వలు ఉన్నాయి. ఎల్ నినో కారణంగా ఈసారి వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నా.. సరైన నీటి నిర్వహణతో ఇబ్బందులు లేకుండా చేయాలని నిర్ణయించాం. రాయలసీమను రతనాల సీమగా తయారు చేస్తాం. మైక్రో ఇరిగేషన్ ద్వారా ఆ ప్రాంతంలోని పంటలకు నీరు ఇచ్చి సస్యశ్యామలం చేస్తాం. కోస్తా జిల్లాల్లో ఆక్వా సాగుకు రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను ఇచ్చేలా చర్యలు చేపట్టాం. మరో రెండు నెలల్లో భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చేస్తుంది. గుంతలు లేని రోడ్లుగా రాష్ట్ర రహదారులను తీర్చిదిద్దుతున్నాం. రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి దానిని నిలబెట్టుకున్నాం. విద్యుత్ కొనుగోలులో 38 పైసల మేర తగ్గించాం. రూ.4,462 కోట్లు విద్యుత్ భారం ప్రజలపై లేకుండా ట్రూడౌన్ చేశాం. భవిష్యత్తులో రూ.1.20 మేర విద్యుత్ ఛార్జీలు తగ్గించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతీ ఒక్కరూ ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేయండి. ఏపీలో తయారయ్యే ఉత్పత్తులు పూర్తి నాణ్యతతో తయారవ్వాలన్నదే మా లక్ష్యం. డ్వాక్రా ఉత్పత్తులకు స్వయం బ్రాండ్ కల్పించాం. చెత్తపన్ను రద్దు చేసి గత పాలకులు వదిలి వెళ్లిన 85 లక్షలమెట్రిక్ టన్నుల చెత్తను తొలగించాం. అన్ని పౌరసేవలనూ వాట్సప్ గవర్నెన్స్ ద్వారా అందించేలా చర్యలు చేపట్టాం. ధృవపత్రాలు కూడా దాని ద్వారానే అందుబాటులో ఉంచేలా చేశాం."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**టెక్నాలజీకి ఆధ్యాత్మికత తోడైతే ఆనందాంధ్రప్రదేశ్ సాధ్యం**

"మహిళా మహానాడు ఇది. వారికి అంకితం చేస్తూ దీనిని నిర్వహించుకున్నాం. దేశంలోనే మొదటి సారి మహిళలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించే పార్టీగా టీడీపీ నిలిచింది. నేషనల్ వర్కింగ్ ప్రెసిండెంట్ లోకేష్ ప్రతిపాదించినట్టుగా తెలుగుదేశం పార్టీలో 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు కల్పిస్తాం. ఏ ఆలోచన చేసినా, పాలసీ చేసినా యువత భవిష్యత్తు కోసమే. గతంలో ఐటీ ఇప్పుడు ఏఐ, క్వాంటం అల్గారిథమ్స్ లాంటి అంశాలను యువత కోసమే తెచ్చాం. మహిళల కోసం, యువత కోసం, బీసీ వర్గాల కోసం తెలుగుదేశం పార్టీ పనిచేస్తోంది. టీడీపీకి అండగా ఉన్న బీసీలకు పార్టీ రుణపడి ఉంటుంది. ఆ వర్గాలను ఆర్థికంగా ముందుకు తేవటమే లక్ష్యంగా పని చేస్తున్నాం. రాష్ట్రంలో టెక్నాలజీతో పాటు ఆధ్యాత్మికత కూడా అవసరమే. ప్రశాంతతకూ, మానసిక ఆనందానికి కేంద్రాలుగా ఆధ్యాత్మిక ప్రదేశాలను తీర్చిదిద్దుతాం. టెక్నాలజీకి ఆధ్యాత్మికత తోడైతే ఆనందాంధ్రప్రదేశ్ సాధ్యమవుతుంది. ప్రభుత్వం అనేక అసాధ్యాలను సుసాధ్యం చేసి చూపింది. ఎన్డీఏ ప్రభుత్వం చేసిన పనుల్ని క్యాడర్ ప్రజల ఇళ్లకు వెళ్లి వివరించాలి. ప్రజల అవసరాలు గుర్తించి సాయం చేయాలి. అర్హులకు పథకాలు అందేలా చూడాలి. అధికారులతో కలిసి నియోజకవర్గాల్లో పర్యటించాలి. మహానాడును గ్రాండ్ సక్సెస్ చేసిన అందరికీ అభినందనలు, ధన్యవాదాలు."అని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు.

### యువతను నైపుణ్యం కలిగిన

# మానవ వనరులుగా తీర్చిదిద్దుతాం

ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా విధానం అని స్పష్టం చేశారు.

**సోషల్ మీడియాలో ఫేక్ కంటెంట్ పట్ల అప్రమత్తంగా ఉండాలి**

సోషల్ మీడియాలో ఫేక్ కంటెంట్ ను ఎక్కువగా వ్యాప్తి చేస్తున్నారు. డీఎస్సీపై ప్రతిపక్ష నేత నిరాధార ఆరోపణలు చేసి బెంగళూరుకు పారిపోయారు. ముఖంపై బురదజల్లి మీరే తుడుచుకోవాలన్నట్లుగా ప్రవర్తించారు. దీనివల్ల లక్షలాది మంది యువత ఆందోళనకు గురవుతారు. వారి భవిష్యత్ ప్రమాదంలో పడుతుంది. మేం పారదర్శకంగా 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేశాం. సోషల్ మీడియా సమాచారంపై యువత క్రాస్ వెరిఫికేషన్ చేసుకోవాలి.

**యువత అంకితభావం, సమిష్టి కృషి, త్యాగం అలవర్చుకోవాలి**

యువత తమకు నచ్చిన రంగంలో విజయం సాధించాలంటే కలిసికట్టుగా పనిచేయాలి. నేను టీమ్ వర్క్ ను విశ్వసిస్తా. కొన్ని త్యాగాలు కూడా చేయాలి. నేను బాబు గారితో పోటీపడాలంటే బాబు గారి కంటే ఎక్కువ కష్టపడాలి. ఈ రోజు నేను సక్సెస్ అయ్యానంటే కోటిమంది కార్యకర్తలు కారణం. అనుకున్నది సాధించేవరకు విడిచిపెట్టకూడదు. నా పాషన్ ప్రజలకు సేవ చేయడం, ఆంధ్ర రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నెం.1 చేయడం. పాషన్ అనేది చాలా అవసరం. తర్వాత టీమ్ వర్క్, త్యాగం. కుటుంబ సభ్యులతో నేను ఎక్కువ సమయం గడపలేకపోతున్నాను. నా లక్ష్యం ఒక్కటే బాబు గారితో, మోదీ గారితో పోటీపడాలి. విజయానికి దగ్గరి దారులు లేవు. కష్టపడటం ఒక్కటే మార్గం. ఇతర నగరాల గురించి ఎంతకాలం మాట్లాడుకుంటాం. అమరావతి, విశాఖ, రాయలసీమ గురించి కూడా మాట్లాడుకోవాలి.

**యువత రాజకీయాల్లోకి రావాలి**

యువత రాజకీయాల్లోకి రావాలి. తెలుగుదేశం పార్టీ యువతకు అనేక అవకాశాలు కల్పిస్తోంది. గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్ బ్యూరో సభ్యుడు కావాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. యువత పోరాటం అలవర్చుకోవాలి. పాదయాత్రలో నేను ప్రతిరోజూ పోరాడాను. నా స్టూల్ లాక్కున్నారు. మైక్ లాక్కున్నారు. ప్రతిరోజూ పోరాటమే. జీవితం ఎప్పుడూ స్ట్రైట్ లైన్ లా ఉండదు. 2019 ఎన్నికల్లో మంగళగిరి నుంచి పోటీ చేసి ఓడిపోయాను. 2024 ఎన్నికల్లో 91వేల మెజార్టీతో విజయం సాధించాను. ఆ రోజు భయపడి ఉంటే.. ఇది సాధ్యమయ్యేది కాదు. కొంతమంది విద్యార్థులు పరీక్షల్లో ఫెయిల్ అయితే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇది సరికాదు. ఒక్క పరీక్ష మీ జీవితాన్ని నిర్ణయించలేదనే విషయాన్ని గ్రహించాలి. విద్యార్థులకు అన్ని విధాలా అండగా నిలుస్తాం.

**మహిళలకు మద్దతుగా నిలవాలి**

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అంతా కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారత ప్రతి ఇంటి నుంచి మొదలవ్వాలి. మా ఇంట్లో మా అమ్మ, బ్రాహ్మణి ఈ విషయంలో స్ఫూర్తిగా నిలిచారు. యువతకు ఉద్యోగాల కల్పనే ఏకైక అజెండాగా పనిచేస్తున్నామని, రాష్ట్రానికి రాయల్ ఎన్ ఫీల్డ్ ఎంత ముఖ్యమో.. పచ్చళ్లు పెట్టే కంపెనీ కూడా అంతే ముఖ్యమని, ఎంఎస్ఎంఈల వల్ల ఎక్కువ ఉద్యోగాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ నాలుగో ఏడాది చదువుతున్న గుంటూరుకు చెందిన వేమూరి సాత్విక్, విజయవాడ ఎస్ఆర్ఆర్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేసిన చరణ్ యాదవ్, కేఎల్ యూలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన విజయవాడకు చెందిన సత్యసాయి పవన్ కుమార్, అమరావతి ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఇంటిగ్రేడెట్ బయోలజీలో మూడో ఏడాది విద్యనభ్యసిస్తున్న ఖ్యాతి వర్ధిని పాల్గొన్నారు.

### జగన్ పీఏ కేఎన్ఆర్ నివాసంలో

# సిట్ తనిఖీలు

నిర్వహిస్తున్నారు. మరోవైపు, సిట్ కార్యాలయంలో కేఎన్ఆర్‌ను అధికారులు విచారిస్తున్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి ఆయనను ప్రశ్నిస్తున్నారు. బుధవారం కూడా కేఎన్ఆర్‌ను సిట్ అధికారులు దాదాపు 9.5 గంటల పాటు విచారించిన విషయం తెలిసిందే. విచారణలో ఆయన పొంతనలేని సమాధానాలు ఇస్తున్నట్లు సమాచారం. సిట్ దర్యాప్తులో కేఎన్ఆర్ ఆస్తులకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఆయన భార్య శశికళ పేరిట తిరుపతి జిల్లాలో 10 ఎకరాల భూమి ఉన్నట్లు, ఆమె బ్యాంకు ఖాతాలో 2019-24 మధ్య సుమారు రూ. 19.86 కోట్లు జమ అయినట్లు అధికారులు గుర్తించినట్టు సమాచారం. వీటికి తోడు విజయవాడలో ఒక కార్ షోరూంలో వాటా, హైదరాబాద్, తిరుపతి, బెంగళూరులో ఫ్లాట్లు, పలు జిల్లాల్లో ఆస్తులు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన కేఎన్ఆర్, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అనూహ్యంగా ఆస్తులు కూడబెట్టిన కోణంలో సిట్ దర్యాప్తు చేస్తోంది. ఒకవైపు విచారణ కొనసాగుతుండగానే, మరోవైపు నివాసంలో సోదాలు జరగడం ఈ కేసులో తీవ్రతను తెలియజేస్తోంది.

# రఘురామ సీరియస్

ఎస్పై పేరు, ఫోన్ నంబర్‌తో తనకు మెయిల్ చేయాలని రఘురామ సూచించారు. ఇందుకోసం teluguveeralevaraarrr@gmail.com అనే మెయిల్ ఐడీని ఆయన ప్రకటించారు. గతంలో ప్రజా దర్బార్‌లో చర్చిలు, కొన్ని దేవాలయాల్లోని మైకుల వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయని రఘురామ గుర్తుచేశారు. ఈ క్రమంలోనే తాను ఈ నెల 11న డీజీపీకి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు లేఖ రాశానని తెలిపారు. చట్ట ప్రకారం పరిమిత డెసిబుల్స్‌లో మైకులు వాడాల్సి ఉండగా, చాలాచోట్ల నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని అన్నారు. కొంతమంది ఎలాంటి అనుమతులు లేకుండా జనావాసాల మధ్య చర్చిలు, ఆలయాలు నిర్మిస్తున్నారని రఘురామ ఆరోపించారు. కొత్తగా ప్రార్థనా మందిరాలు నిర్మించాలంటే పంచాయతీ తీర్మానంతో పాటు జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. శబ్ద కాలుష్య నియంత్రణ, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### పవన్ వల్లే ఉద్యోగం, భూమి..

# ఆ లాజిక్ ఎలా మిస్ అయ్యారు?

జనసేన నేత, సినీ నటుడు హైపర్ ఆది ఘాటుగా స్పందించారు. పక్కవాళ్ల మాటలు విని, పవన్ కల్యాణ్ లాంటి వ్యక్తిని విమర్శించడం తగదని హితవు పలికారు. సాయం చేసిన వ్యక్తినే నిందించే మనస్తత్వం ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. ఇటీవల సుగాలి ప్రీతి కుటుంబ సభ్యులు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసి, తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చాక తమను పట్టించుకోవడం లేదని, ఓట్ల కోసమే ఈ అంశాన్ని వాడుకున్నారని ప్రీతి తల్లి ఆరోపించారు. ఈ నేపథ్యంలో హైపర్ ఆది ఒక వీడియో ద్వారా స్పందించారు. "అమ్మా.. మీరు మీ పాప కోసం పోరాడుతున్నప్పుడు ఏ ప్రభుత్వమైనా స్పందించిందా? పవన్ కల్యాణ్ గారు ఈ అంశాన్ని లేవనెత్తిన తర్వాతే దేశం మొత్తం తెలిసింది. ఆయన ప్రశ్నించిన తర్వాతే భయపడి అప్పటి ప్రభుత్వం మీ భర్తకు ఉద్యోగం, మీకు భూమి ఇచ్చింది. ఈ చిన్న లాజిక్ మీరు ఎలా మిస్ అయ్యారు? పవన్ డిమాండ్ చేయకముందే ప్రభుత్వం ఇచ్చి ఉంటే అది ప్రేమ అనుకోవచ్చు. ఆయన అడిగాక ఇచ్చారంటే అది ఆయనపై ఉన్న భయం అనుకోవాలి" అని ఆది వివరించారు. "పవన్ కల్యాణ్ ప్రోద్బలంతోనే కేసు సీబీఐకి వెళ్లింది. ఛార్జిషీట్‌లో పేర్లు మార్చేసి, సీబీఐకే అంతుచిక్కకుండా ఉన్న కేసు గురించి పవన్ ఇంకెంతకాలం పోరాడాలి? తన నెల జీతం కూడా తీసుకోకుండా పిఠాపురంలోని అనాథ పిల్లలకు ఇచ్చే వ్యక్తి, కులమతాలు చూడకుండా రైతులను ఆదుకునే వ్యక్తి ఓట్ల కోసం ఒక అంశాన్ని వాడుకుంటారా? పాలు పోసిన వ్యక్తినే కాటేసే మనస్తత్వం మీకు ఎలా వచ్చిందో అర్థం కావడం లేదు. పక్కవాళ్ల మాటలు విని పవన్‌ను విమర్శించడం మానుకోవాలి. పవన్ కాకుండా మీకు ఎవరైనా న్యాయం చేయగలిగితే, నా జీవితంలో జనసేన గురించి మాట్లాడను" అంటూ ఆది సవాల్ విసిరారు. ఈ పరిణామంతో సుగాలి ప్రీతి కేసు మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

# జైలు నుంచి విడుదలైన పాస్టర్ అభినయ్ దర్శన్

వెల్లడించారు. పోలీసులు, జైలు సిబ్బంది తనను గౌరవంగా చూసుకున్నారని దర్శన్ తెలిపారు. విచారణలో కూడా మర్యాదగా వ్యవహరించారని... తనపై చేయి చేసుకోలేదని చెప్పారు. జైల్లో కూడా జైలు సిబ్బంది, ఖైదీలు తనను ఇబ్బందులకు గురి చేయలేదని తెలిపారు. తన పాదయాత్ర ఆగిపోతుందంటూ వస్తున్న వార్తలపై ఆయన స్పందిస్తూ... పాదయాత్రకు విరామం ఉండదని, పాడేరు నియోజకవర్గం నుంచే పాదయాత్రను కొనసాగిస్తానని తెలిపారు. తాను గాయపడిన సింహం వంటి వాడినని... మరింత కసితో వేట మొదలు పెడతానని అన్నారు. ప్రజల కోసం పోరాటానికి తాను ఎప్పుడూ సిద్ధమేనని చెప్పారు.

# చంద్రబాబు బూట్లు ఎప్పుడు తుడుస్తావ్?

అన్నారు. విజయవాడలో మీడియా ముందు మాట్లాడటం కాదని... దమ్ముంటే గుడివాడలో అడుగు పెట్టాలని సవాల్ విసిరారు. గుడివాడలో నాని సీటు గల్లంతయిందని... అసలు ఆయన గురించి మాట్లాడటం కూడా వేస్ట్ అని చెప్పారు. గుడివాడ ప్రజలు నానిని ఎప్పుడో మర్చిపోయారని అన్నారు. జనాలు ఛీ కొడుతున్నా కొడాలి నాని సిగ్గు, శరం లేకుండా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కొడాలి నాని... చంద్రబాబు బూట్లు ఎప్పుడు తుడుస్తావో చెప్పు అని ప్రశ్నించారు. గుడివాడ రాజకీయాలపైనే పట్టు లేని కొడాలి నానికి రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడటం అవసరమా? అని ఎద్దేవా చేశారు.

# తనకు సంబంధం లేదన్న విజయసాయిరెడ్డి

చెప్పలేదని వెల్లడించారు. మద్యం కుంభకోణానికి సంబంధించిన విషయాలన్నీ రాజ్ కెసిరెడ్డికి మాత్రమే తెలుసని చెప్పానని వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా గతంలో సీజ్ చేసిన మొబైల్ ఫోన్‌లలోని వివరాలను ఈడీ అధికారులు సేకరించారని తెలిపారు. లోపల ప్రశ్నలు, విచారణలు పెద్దగా ఏమీ జరగలేదని పేర్కొన్నారు. తన ఫోన్‌లోని డేటా ట్రాన్స్ ఫర్ కోసం పిలిచినట్లు చెప్పారు. వారికి అవసరమైన సమాచారం తన ఫోన్‌లో ఉంటుందనే ఉద్దేశంతో ఆ డేటాను తీసుకున్నట్లు చెప్పారు. మద్యం పాలసీ కుంభకోణం ఎలా జరిగింది, ఏం జరిగిందనే విషయాలు తెలిసిన వ్యక్తి రాజ్ కెసిరెడ్డి మాత్రమే అన్నారు. ఇప్పటి వరకు తాను ఆయన ఒక్కరి పేరు తప్ప ఎవరి పేరునూ చెప్పలేదని అన్నారు. సిట్ అధికారులకైనా, ఈడీ అధికారులకైనా తాను ఇదే విషయం చెప్పానని అన్నారు. తనను ఎవరు లక్ష్యంగా చేసుకున్నా భయపడే వ్యక్తిని కాదని వ్యాఖ్యానించారు. తిరుమల వెంకన్న సాక్షిగా తాను ఎలాంటి తప్పు చేయలేదని విజయసాయిరెడ్డి అన్నారు.

# ఈడీ సోదాలు

వెనక్కి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. పదేళ్ల పాటు కేరళ ముఖ్యమంత్రిగా ఉన్న విజయన్ కు ప్రజల్లో మంచి ఇమేజ్ ఉందని... ఆ ఇమేజ్ డ్యామేజ్ చేసేందుకే ఈడీ దాడులు జరిగాయని రామకృష్ణ విమర్శించారు. మోదీ ప్రధాని అయినప్పటి నుంచి ప్రతిపక్ష నేతలపై ఈడీ దాడులు, అక్రమ కేసులు సాధారణమై పోయాయని దుయ్యబట్టారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ శిసోడియా విషయంలో కూడా ఇదే జరిగిందని రామకృష్ణ అన్నారు. బీజేపీ కండువా కప్పుకునే వారు ఎవరైనా సరే వారిపై ఎలాంటి దాడులు జరగవని చెప్పారు. అసోం సీఎం హిమంత బిశ్వశర్మ, బెంగాల్ సీఎం సువేందు అధికారిపై కూడా గతంలో మోదీ ఆరోపణలు చేశారని... అయితే, వారు బీజేపీలో చేరడంతో వాళ్లపై ఎలాంటి చర్యలు లేవని మండిపడ్డారు. కేవలం ప్రతిపక్ష నేతలపై మాత్రమే ఒక పక్కా ప్లాన్ ప్రకారం దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వ విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని అన్నారు.

# విద్యుత్ టవర్లు వేయండి

రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ... 1994-95లో కొత్తపూడి గ్రామంలోని దళిత, పేద కుటుంబాలకు ప్రభుత్వం పట్టాల రూపంలో భూమి ఇచ్చిందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పట్టాలన్నింటినీ ఫ్రీ హోల్డ్ గా మార్చేశారని వెల్లడించారు. ఇప్పుడు పోర్టు అవసరాల కోసం ఆ పొలాల్లో హెవీ విద్యుత్ లైన్ టవర్లను వేయడానికి అధికారులు మార్కింగ్ వేశారని తెలిపారు. రైతులకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండానే మార్కింగ్ వేశారని విమర్శించారు. హై ఓల్టేజ్ విద్యుత్ టవర్ల కారణంగా తమ భూములకు విలువ తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. హై ఓల్టేజ్ విద్యుత్ టవర్లు వేయాలనుకుంటే... ఆ పొలాలను పూర్తిగా కొనుగోలు చేయాలని పేర్ని నాని అన్నారు. ఈ గ్రామ రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించిన తర్వాతే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

## ఎడిటర్ వాయిస్

# వైసీపీ ఇన్‌ఛార్జిలకు బిగ్‌టెస్ట్ పెట్టిన జగన్!

వైసీపీలో మొత్తం 175 మంది అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జిలు ఉన్నారు. వీరిలో చాలా మంది ఇన్ యాక్టివ్‌గా ఉన్నట్లుగా వార్తలు వస్తున్నాయి. అనేక చోట్ల ఇంచార్జి పదవిని అందుకుని కూడా పెద్దగా సౌండ్ చేయకుండా ఉంటున్నారు అని వార్తలు ప్రచారంలో ఉన్నాయి. మరో వైపు చూస్తే ఇంచార్జిలు పెద్దగా క్యాడర్ తో టచ్ లోకి వెళ్ళడం లేదు అని విమర్శలు ఉన్నాయి. ఇక సార్వత్రిక ఎన్నికలు మూడేళ్ల వ్యవధిలో జరుగుతాయి కదా అపుడు చూసుకుందామని రెస్ట్ మోడ్ లోనే చాలా మంది ఉన్నారు అని అంటున్నారు. ఈ నేపథ్యంలో దగ్గరలోనే పోరాటం అని జగన్ తేల్చి చెప్పేశారు. స్థానిక సంస్థలలో ఫైట్ చేయాల్సిందే అని దిశా నిర్దేశం చేశారు.

లైట్ తీసుకున్న వైనం : స్థానిక సంస్థల ఎన్నికలను వైసీపీ ఇంచార్జులలో పలువురు లైట్ తీసుకున్నారు అని కూడా ప్రచారంలో ఉంది. ఎటూ అధికారంలో ఉన్న కూటమికే మొగ్గు ఉంటుంది అనవసరంగా ఫీల్డ్ లోకి దిగి చేతులు కాల్చుకోవడం ఎందుకు అన్న ధోరణిలో ఉన్న వారూ అనేకమంది ఉన్నారని అంటున్నారు. పైగా 2021లో వైసీపీ అధికారంలో ఉన్నపుడు స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు చేసుకుని ప్రతిపక్షానికి ఏ మాత్రం చాన్స్ ఇవ్వలేదు. ఇపుడు ఒకటి కాదు మూడు పార్టీలు కలసి ఉన్నాయి. దాంతో కచ్చితంగా కూటమిదే పై చేయి ఉంటుందని భావించి కూడా మిన్న కున్న నేపథ్యం వైసీపీలో ఉంది అని అంటున్నారు.

నాలుగు నెలల టైం : ఇపుడు చూస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో దిగాల్సిందే అని అధినేత జగన్ అదేశించారు. అంతే కాదు స్థానిక ఎన్నికల్లో కూటమి ఏకగ్రీవాలు అన్న మాట వినిపించకూడదు అని జగన్ సీరియస్ గానే చెప్పారు. వైసీపీ జెండా అన్ని చోట్లా ఎగిరి తీరాలని ఆయన అంటున్నారు. ఎక్కడైనా ఏకగ్రీవం అన్నది జరిగితే అది కచ్చితంగా ఆ నియోజకవర్గం ఇంచార్జి వైఫల్యంగా భావిస్తాను అని కూడా జగన్ స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇంచార్జిలు పూర్తి సహకారం అందించాలని జగన్ సూచించారు. అలా వారికి ఈ రోజున సహకరిస్తే రేపు వారు సార్వత్రిక ఎన్నికల్లో తిరిగి సహకరిస్తారు అని కూడా అన్నారు. ఇక చూస్తే స్థానిక ఎన్నికలకు నాలుగైదు నెలల సమయం మాత్రమే ఉంది. దాంతో ఇంచార్జిలు అంతా మల్లగుల్లాలు పడాల్సిన పరిస్థితి ఉంది అని అంటున్నారు.

జాతకాలు మారుతాయి : లోకల్ బాడీ ఎన్నికల్లో ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో అయినా వైసీపీ అభ్యర్థుల పెర్ఫార్మెన్స్ బాగా లేకపోయినా ఎకగ్రీవాలు ఎక్కువగా జరిగినా అది అటూ ఇటూ తిరిగి వైసీపీ ఇంచార్జి మీదకే వస్తుందని అంటున్నారు. దాంతో మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాన్ని హోల్డ్ చేయలేదని భావించి పార్టీని ముందుకు నడిపే సామర్థ్యం లేదని కూడా తలచి పక్కన పెడతారా అన్నదే అందరిలో బెంగగా ఉంది అని అంటున్నారు. ఇంచార్జిల ఫెయిల్ గానే భావిస్తాను అని జగన్ ఒక స్పష్టత ఇచ్చేశారు. దాంతో ఇపుడు ఇంచార్జిల మీదనే భారం అంతా పడుతోంది. జగన్ పెట్టిన ఈ బిగ్ టెస్ట్ లో ఎంత మంది పాస్ అవుతారో స్థానిక ఎన్నికల్లో తేలిపోతుంది అని అంటున్నారు. ఫెయిల్ అయిన చోట్ల కొత్త ఇంచార్జిలు వస్తారని కూడా అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

## క్రైం వాయిస్

# ఎల్బీనగర్‌లో ఆగివున్న లారీని ఢీకొట్టిన కారు..

### ఇద్దరికి తీవ్ర గాయాలు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్బీనగర్‌లో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాల య్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రు లను ఆసుపత్రికి తరలించారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిత్ర లేఅవుట్ సమీపంలో తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. సూర్యాపేట జిల్లాకు చెందిన ధరావత్ అశోక్ కారు నడుపుతుండగా రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని గమనించక ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కాగా, డ్రైవర్ అశోక్‌తో పాటు కారులో ప్రయాణిస్తున్న సరూర్‌నగర్‌కు చెందిన బొర్రా మధు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను కామినేని ఆసుపత్రికి తరలించారు.

# రూ.కోట్ల విలువైన ఇల్లు.. రూ.20 లక్షలకే కొనుగోలు చేశారట

### రికార్డులు చూపిన జలమండలి అవినీతి జీఎం - ఏసీబీ దర్యాప్తులో విస్మయకర అంశాలు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంలో ఏసీబీకి చిక్కిన జలమండలి జీఎం అనంత లక్ష్మీకుమార్ కేసు దర్యాప్తులో విస్మయకర కోణాలు వెలుగు చూస్తున్నాయి. మల్లాపూర్ వెంకటరమణ కాలనీలో ఆయన ఇంట్లోనే రూ.1.1కోట్ల నగదు లభ్యం అయిన సంగతి తెలిసిందే. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులెవరైనా ఇంటిని నిర్మించుకుంటే బ్యాంకుల నుంచి రుణం తీసుకుంటారు.. కానీ అనంత లక్ష్మీకుమార్ మాత్రం వేరొకరి దగ్గర పాత ఇంటిని తీసుకొని, ఒక్క పైసా రుణం లేకుండానే కొత్తగా నిర్మించుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అదీ కాకుండా రూ.కోట్ల విలువ చేసే ఆ ఇంటిని కేవలం రూ.20లక్షలకే ఒప్పందం కుదుర్చుకున్నట్లు రికార్డుల్లో చూపించినట్లు వెల్లడైంది.

**లెక్క తేలని రూ.2.13కోట్లు**

హైదరాబాద్ నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని జలమండలి ప్రాజెక్టు డివిజన్-8 జనరల్ మేనేజర్ అనంత లక్ష్మీకుమార్ 2003లో సర్వీసులో చేరారు. తాజాగా ఏసీబీకి దొరికే వరకు అతడితోపాటు అతడి కుటుంబసభ్యుల పేర్లపై రిజిస్టరై ఉన్న వ్యవసాయ భూములు, నివాస సముదాయాలు, ఓపెన్ ప్లాట్లు, వాహనాలు, బ్యాంకు బ్యాలెన్స్ మొత్తం కలిపి రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం రూ.3.01 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ మరెన్నో రెట్లు అధికంగా ఉంటుందని భావిస్తున్నారు. ఉద్యోగంతోపాటు వ్యవసాయం, ఇతర అధికారిక మార్గాల్లో సమకూరిన మొత్తం ఆదాయం రూ2.2కోట్లుగా గుర్తించారు. కుటుంబ నిర్వహణకు అయిన ఖర్చును రూ.1.32కోట్లు. ఈ లెక్కన అతడి వద్ద రూ.88లక్షలు మాత్రమే మిగిలి ఉండాలి. కానీ అతడి ఆస్తుల విలువ ఏకంగా రూ.3.01కోట్లుగా ఉండటంతో రూ.2.13కోట్ల విలువైన ఆస్తులు అదనంగా అతడి అధీనంలో ఉన్నట్లు తేలింది. ఇదంతా అక్రమ మార్గంలోనే సంపాదించి ఉంటాడని ఏసీబీ అధికారులు అంచనాకు వచ్చారు.

# ఆశలు చిదిమిన అప్పులు.. భార్యాపిల్లల్ని చంపి ఉరేసుకున్న కౌలు రైతు



**ఖిల్లాగణపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మామిడితోటను కౌలుకు తీసుకున్న ఓ రైతు కుటుంబానికి ఆరేళ్లుగా అప్పులే మిగిలాయి. వాటిని తీర్చేక్రమంలో అలసిపోయిన కుటుంబ పెద్ద... భార్య, ఇద్దరు పిల్లలను పది అడుగుల లోతున్న నీటి సంపులో వేసి, ఆయనా బలవన్మరణం పొందారు. ఈ విషాదకర ఘటన వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలం సల్కెలాపురంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన ప్రకారం... సల్కెలాపురం శివారులో హైదరాబాద్ వాసి శ్రీనివాసరావుకు చెందిన 52 ఎకరాల మామిడితోటను మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూరుకు చెందిన గంగల నర్సింహులు(40) ఆరేళ్లుగా లీజుకు తీసుకుంటున్నారు. భార్య ఎల్లమ్మ ఎలియాస్ హేమలత(33), కుమారుడు సాయినిహాల్(15), కుమార్తె సాహితీశ్రీ(12)తో కలిసి అక్కడే ఉంటున్నారు. ఈ ఏడాదికి చెందిన రూ.15 లక్షలు కౌలు డబ్బులను చెల్లించి, మరో రూ.10 లక్షల పెట్టుబడి పెట్టారు. ఆరేళ్లుగా నష్టాలు వస్తుండటంతో డోకూర్‌లో, అత్తగారి ఊరైన గద్వాలలో రూ.60 లక్షల వరకు అప్పులు చేశారు. అవి క్రమంగా పెరుగుతూ రూ.1.20 కోట్లకు చేరడంతో అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. దాంతో స్వగ్రామంలోని ఇంటిపై రుణం తీసుకుని కొంత వరకు చెల్లించారు. ప్రస్తుతం ఇంటి అప్పు కంతుల(వాయిదాలు)నూ చెల్లించలేని పరిస్థితి వచ్చింది.

# అమలాపురంలో ఘోరం

## మైనర్ బాలికకు రహస్య అబార్షన్ యత్నం!

### ప్రభుత్వ డాక్టర్ ప్రైవేట్ దందా.. నిబంధనలు గాలికి!

### తల్లిదండ్రులకు తెలియకుండా ఆసుపత్రిలో అడ్మిషన్.. రంగంలోకి పోలీసులు





**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో మానవత్వాన్ని, వైద్య వృత్తిని నిలువునా ముంచేసే ఒక సంచలన ఉదంతం వెలుగులోకి వచ్చింది. పచ్చని కోనసీమలో ప్రభుత్వ జీతం తింటూ, ప్రైవేట్ ఆసుపత్రి ముసుగులో కొందరు చేస్తున్న చీకటి దందా బట్టబయలైంది. ఒక మైనర్ బాలిక జీవితంతో ఆడుకుంటూ, చట్టవిరుద్ధంగా అబార్షన్ (గర్భస్రావం) చేయడానికి సిద్ధపడిన ఓ ప్రభుత్వ వైద్యురాలి వ్యవహారం ఇప్పుడు జిల్లావ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది.

**కేస్ షీట్‌లో వివరాలు మాయం.. అంతా రహస్యం!**

విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పి. గన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ లంకె శిరీష, అమలాపురంలోని 'విమెన్ అండ్ కేర్ జనరల్ ఆస్పత్రి' వేదికగా ఈ చీకటి వ్యవహారానికి తెరలేపారు. ఇంటర్మీడియట్ చదువుతున్న ఒక మైనర్ బాలికను, ఆమె తల్లిదండ్రులకు తెలియకుండా, సదరు బాలిక ప్రియుడు సదరు ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువచ్చాడు. తీరా చూస్తే, చట్ట ప్రకారం మైనర్ల విషయంలో తీసుకోవాల్సిన కనీస జాగ్రత్తలను ఆసుపత్రి యాజమాన్యం పూర్తిగా గాలికి వదిలేసింది. విద్యార్థినికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని, గుర్తింపు వివరాలను కేస్ షీట్‌లో నమోదు చేయకపోవడం గమనార్హం. కేవలం రక్తం తక్కువగా ఉండటం వల్లే అడ్మిట్ చేసుకున్నామని ఆసుపత్రి సిబ్బంది కల్లబొల్లి కబుర్లు చెబుతున్నప్పటికీ.. అసలు కథ వేరే ఉందని లోపల జరుగుతున్న వ్యవహారాలు స్పష్టం చేస్తున్నాయి.

**ఫోన్ లొకేషన్‌తో గుట్టు రట్టు.. నిందితులు పరార్!**

నగరం గ్రామానికి చెందిన ఈ మైనర్ బాలిక ఇంట్లో కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే నగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు బాలిక ఫోన్ లొకేషన్ ఆధారంగా విచారణ జరపగా, సంచలన విషయాలు బయటపడ్డాయి. లొకేషన్ అమలాపురంలోని సదరు ప్రైవేట్ ఆసుపత్రిగా చూపించడంతో తల్లిదండ్రులు, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. తల్లిదండ్రులు ఆసుపత్రికి వస్తున్నారనే సమాచారం ముందే లీక్ అవ్వడంతో.. బాలికను తీసుకువచ్చిన ప్రియుడు, అతనికి సహకరించిన మిగిలిన వ్యక్తులు అక్కడి నుండి చాకచక్యంగా పరారయ్యారు.

**అనుమతులు లేవు.. పర్యవేక్షణే లేదు!**

ఈ ఉదంతంతో సదరు ఆసుపత్రి గుట్టు ఒక్కొక్కటిగా రచ్చకెక్కుతోంది. అసలు ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండానే ఈ 'విమెన్ అండ్ కేర్ జనరల్ ఆస్పత్రి'ని నడుపుతున్నట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో సేవలందించాల్సిన సదరు వైద్యురాలు, ఇటువంటి అనధికారిక ప్రైవేట్ ఆసుపత్రుల అండతో ఇలాంటి అక్రమ గర్భస్రావాలకు తెగబడటం వెనుక పెద్ద నెట్‌వర్కే ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మైనర్ బాలికల జీవితాలతో చెలగాటమాడుతూ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్న ఇలాంటి కీచకులు, వారికి అండగా నిలుస్తున్న వైద్యులపై ఉన్నతాధికారులు, జిల్లా యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ ఘటనపై నగరం మరియు అమలాపురం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# పెద్దపులి దాడిలో 9 లేగదూడలు హతం

### పోలవరం జిల్లాలో ఘటన



**రాజవొమ్మంగి, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా రాజవొమ్మంగి మం డలంలో కొద్దిరోజులుగా ప్రశాంతంగా ఉన్న పెద్దపులి.. మరోసారి పంజా విసిరింది. మండలంలోని చికిలింత, పెద్దగర్రంగి, పెద్ద రేలంగిపాడు గ్రామాల్లో తొమ్మిది లేగ దూడలను హతమార్చినట్లు రేంజర్ ఉషారాణి తెలిపారు. చికిలింతలో ఏడు, పెద్దగర్రంగి, పెద్ద రేలంగిపాడుల్లో ఒక్కో దూడ మీద బుధవారం తెల్లవారుజామున పులి దాడిచేసి హతమార్చిందన్నారు. వాతంగి, చికిలింత పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయంలో బయటకు రావొద్దని అటవీశాఖాధికారులు అప్రమత్తం చేస్తున్నారు. పశువులను అడవిలోకి వదల్దొద్దని సూచిస్తున్నారు.

## 'పేదల తిరుపతి'గా పేరుగాంచిన మన్యంకొండ..

# ౬౦౦ ఏళ్ల దివ్య చరిత్ర వెనుక అద్భుతాలు!

మన్యంకొండ మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రసిద్ధ వేంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రం. "పేదల తిరుపతి"గా పేరుగాంచిన ఈ ఆలయం మహబూబ్‌నగర్ నుండి 17 కి.మీ దూరంలో ఉంది. కొండపై వేంకటేశ్వర స్వామి ఆలయం, దిగువన అలివేలు మంగతాయారు అమ్మవారి ఆలయం ఉండటం దీని ప్రత్యేకత. 600 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దివ్యక్షేత్రం గురించి ఇప్పుడు తెలుసుకుందాం. మన్యంకొండ తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న ప్రసిద్ధ వేంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రం. "పేదల తిరుపతి"గా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం, మహబూబ్‌నగర్ పట్టణం నుంచి సుమారు 17 కిలోమీటర్ల దూరంలో రాయచూరు మార్గంలో ఉంది. సుమారు 600 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ క్షేత్రంలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి భక్తులకు దర్శనమిస్తారు. కొండపై స్వామివారి ఆలయం, కొండ దిగువన అలివేలు మంగతాయారు అమ్మవారి ఆలయం ఉండటం ఈ క్షేత్ర ప్రత్యేకత.

**తెలంగాణ తిరుపతిగా ఖ్యాతి**

కలియుగ వైకుంఠంగా, తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన మన్యంకొండ స్వామివారి క్షేత్రం భక్తుల విశ్వాసానికి నిలయంగా నిలుస్తోంది. ఆర్థికంగా తిరుపతి వెళ్లలేని భక్తులు ఇక్కడి స్వామిని దర్శిస్తే, తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించిన ఫలితం లభిస్తుందని నమ్మకం ఉంది.

**తిరుమల తరహాలో కొండపై స్వామి సన్నిధి**

తిరుమల మాదిరిగానే ఇక్కడ కూడా వేంకటేశ్వర స్వామి కొండపై కొలువై ఉన్నారు. దిగువన అలివేలు మంగతాయారు అమ్మవారి ఆలయం ఉంది. పూర్వం ఈ ప్రాంతంలో మునులు తపస్సు చేసినందున దీనిని "మునులకొండ" అని పిలిచేవారు. కాలక్రమేణా అదే పేరు "మన్యంకొండ"గా మారింది.

**అద్భుతమైన విశ్వాసాలు - స్వయంభూ క్షేత్రం**

సుమారు 600 సంవత్సరాల ప్రాచీనమైన ఈ ఆలయం అనేక విశ్వాసాలకు నిలయం. ఇక్కడ:

ఎవరు తవ్వకుండానే కోనేరు ఏర్పడిందని..

ఉలి ముట్టకుండానే స్వామి విగ్రహం రూపుదిద్దుకుందని..

చెక్కని పాదాలు స్వయంగా వెలిశాయని..





ఇలాంటి అద్భుత విశ్వాసాల కారణంగా ఈ క్షేత్రాన్ని ప్రత్యేకంగా భావిస్తారు.

ఆలయ స్థాపన కథ

చరిత్ర ప్రకారం, తమిళనాడులోని శ్రీరంగం సమీపంలోని అళహరి గ్రామానికి చెందిన అళహరి కేశవయ్యకు శ్రీనివాసుడు స్వప్నంలో దర్శనమిచ్చి మన్యంకొండపై తన సన్నిధి ఉందని, అక్కడ నిత్య సేవలు చేయాలని ఆదేశించారట. ఆ ఆదేశం మేరకు కేశవయ్య కుటుంబంతో కలిసి ఇక్కడ స్థిరపడి స్వామివారికి సేవలు ప్రారంభించాడు.

ఒకసారి కృష్ణా నదిలో స్నానం చేస్తుండగా శిలారూపంలో ఉన్న వేంకటేశ్వర స్వామి విగ్రహం ఆయన దోసిలిలో పడిందని చెబుతారు. ఆ విగ్రహాన్ని తీసుకొచ్చి మన్యంకొండ గుహలో శేషశాయి రూపంలో ప్రతిష్ఠించి పూజలు ప్రారంభించారు.

**ఆలయ విశేష నిర్మాణాలు**

మన్యంకొండ ఆలయంలో ఆంజనేయస్వామి, గరుడాళ్వార్ విగ్రహాలు కూడా ప్రతిష్ఠించబడ్డాయి. అలాగే సమీపంలో మునులు తపస్సు చేసిన "మునుల గుహ"ను కూడా దర్శించవచ్చు.

**అమ్మవారి ఆలయం ప్రత్యేకత**

1957-58 మధ్య కాలంలో కొండ దిగువన అలివేలు మంగతాయారు అమ్మవారి ఆలయం నిర్మించబడింది. ఇక్కడ ప్రతిరోజూ నిత్య కల్యాణం జరుగుతుంది. శుక్రవారాల్లో కుంకుమార్చనలు ప్రత్యేక ఆకర్షణ.

**నిత్యకల్యాణం - ఉత్సవాల వైభవం**

మన్యంకొండ ఆలయంలో రోజువారీగా పలు సేవలు జరుగుతాయి:

ప్రతి శనివారం తిరుచ్చి సేవ

ప్రతి పౌర్ణమికి స్వామి వారి కల్యాణోత్సవం

ఫాల్గుణ మాసంలో అమ్మవారి ఉత్సవాలు (వారం రోజుల పాటు)

ఏడాదికి ఒకసారి ఘనంగా కల్యాణ మహోత్సవం

పెళ్లిళ్లకు ప్రసిద్ధి

అమ్మవారి ఆలయంలో ప్రతిరోజూ వివాహాలు జరుగుతాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఇక్కడే వివాహం చేసుకుంటారు. అమ్మవారి సన్నిధిలో వివాహం చేసుకుంటే సుఖసంతోషాలు, సంతానం, సంపదలు కలుగుతాయని భక్తుల నమ్మకం. పెళ్లిళ్ల సీజన్‌లో ఒక రోజుకు 20-25 వివాహాలు కూడా జరుగుతాయి.

**ఎలా చేరుకోవాలి?**

హైదరాబాద్, కర్నూలు వంటి ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల ద్వారా మన్యంకొండకు సులభంగా చేరుకోవచ్చు.

# విశ్వ వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శుక్రవారం, 29 మే, 2026




www.viswamvoice.com

# అచ్యుతాపురం 'లోటస్ అపార్ట్‌మెంట్' రోడ్డులో నరకం!




## పూడిమడక రోడ్డు ఇండియన్ ఆయిల్ బంక్ వెనుక వెలిసిన ప్లాస్టిక్, మురికి సామ్రాజ్యం
## పారిశ్రామిక హబ్‌లో పడకేసిన పారిశుధ్యం.. అంటువ్యాధుల గురవుతున్న నివాసితులు.. అధికారులు స్పందించరా?

**అచ్యుతాపురం (విశ్వం వాయిస్ బ్యూరో):**

అనకాపల్లి జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనే పారిశ్రామికంగా ఎంతో కీలకమైన కేంద్రంగా గుర్తింపు తెచ్చుకున్న అచ్యుతాపురం నియోజకవర్గం మరియు మండల కేంద్రంలో పారిశుధ్య నిర్వహణ పతాక స్థాయికి చేరింది. స్థానిక అధికారులు, పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యానికి అచ్యుతాపురంలోని ప్రముఖ నివాస ప్రాంతాలు మురికికూపాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా అచ్యుతాపురం పూడిమడక రోడ్డులోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వెనుక వైపు ఉన్న లోటస్ అపార్ట్‌మెంట్ ప్రధాన రోడ్డు మార్గం ప్రస్తుతం చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, ఘన వ్యర్థాలతో నిండిపోయి అధ్వాన్నంగా తయారైంది.

**సాక్ష్యాలతో సహా కళ్లకు కడుతున్న దుస్థితి!**

ప్రజలు పంపుతున్న ఫోటో ఆధారాలను పరిశీలిస్తే ఇక్కడి దుస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంది:

రహదారిపైనే చెత్త సామ్రాజ్యం లోటస్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లే దారిలోనే ఖాళీ ప్రదేశాలన్నీ అనధికారిక పబ్లిక్ డంపింగ్ యార్డుల్లా మారిపోయాయి. వ్యర్థాలను సేకరించడానికి ఏర్పాటు చేసిన నీలి రంగు డ్రమ్ములు నిండిపోయి కిందపడినా, వాటిని తరలించాలనే కనీస బాధ్యత స్థానిక పారిశుధ్య విభాగానికి లేకపోవడం గమనార్హం.

కొండలా పేరుకుపోయిన ప్లాస్టిక్. రోడ్డుకు ఇరువైపులా వందలాది ప్లాస్టిక్ కవర్లు, కుళ్లిన వ్యర్థాలు ప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి. దీని వల్ల తీవ్రమైన దుర్వాసన వస్తుండటంతో, లోటస్ అపార్ట్‌మెంట్ వాసులు కనీసం ఇళ్లల్లో ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోలేకపోతున్నారు. దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయి డెంగ్యూ, మలేరియా వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు వణికిపోతున్నారు.

రద్దీ జంక్షన్ సమీపంలోనే ఈ నిర్లక్ష్యం . భారీ కంటైనర్లు, వాహనాల రాకపోకలతో ఎప్పుడూ బిజీగా ఉండే పూడిమడక మెయిన్ రోడ్డుకు, ప్రముఖ కూడలికి అత్యంత సమీపంలోనే ఈ అధ్వాన్నపు దృశ్యాలు మిస్తున్నాయి. నియోజకవర్గ కేంద్రానికి రోజూ వందలాది మంది వస్తుండగా, ప్రధాన రహదారి పక్కనే ఇలాంటి అపరిశుభ్రత స్వాగతం పలకడం అచ్యుతాపురం ప్రతిష్టను దెబ్బతీస్తోంది.

**నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ గారూ.. ఇదా అభివృద్ధి?**

పరిశ్రమల ఏర్పాటు, రోడ్ల విస్తరణపై చూపిస్తున్న శ్రద్ధ ప్రజల ఆరోగ్య భద్రతపై ఎందుకు చూపించడం లేదని లోటస్ అపార్ట్‌మెంట్ నివాసితులు నిలదీస్తున్నారు.

"లక్షల రూపాయలు ఖర్చు పెట్టి అపార్ట్‌మెంట్‌లో ఇళ్లు కొనుక్కుని నివసిస్తుంటే.. తీరా బయటకు వచ్చే రోడ్డు మార్గంలో ముక్కు మూసుకుని నడవాల్సి వస్తోంది. చిన్న పిల్లలు, వృద్ధులు ఈ కంపు భరించలేక అనారోగ్యం పాలవుతున్నారు. స్థానిక పంచాయతీకి పన్నులు కడుతున్నా ఫలితం లేదు."

**తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్న లోటస్ అపార్ట్‌మెంట్ నివాసితులు.**

'విశ్వం వాయిస్' కథనానికి తక్షణ స్పందన: వెంటనే సమస్యను పరిష్కరిస్తాం - ఎంపీడీవో బి. చిన్నారావు" హామీ

లోటస్ అపార్ట్‌మెంట్ రహదారి మార్గంలో నెలకొన్న ఈ తీవ్ర పారిశుధ్య లోపంపై 'విశ్వం వాయిస్' ప్రతినిధి స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిని వివరణ కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ...

"అచ్యుతాపురంలో ప్రస్తుతం బ్రిడ్జి పనులు జరుగుతుండడం వల్ల, ఆ రోడ్డు మార్గంలోకి పారిశుధ్య కార్మికులు, వాహనాలు వెళ్లడానికి కొంత ఇబ్బందిగా మారింది. అందువల్లే అక్కడ తాత్కాలికంగా చెత్త పేరుకుపోయింది. ఈ విషయాన్ని మా దృష్టికి తీసుకువచ్చినందుకు ధన్యవాదాలు. లోటస్ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న సమస్యపై తక్షణమే స్పందించి, చెత్తను పూర్తిగా తొలగించాల్సిందిగా స్థానిక పంచాయతీ అధికారులకు ఇప్పుడే ఆదేశాలు జారీ చేస్తున్నాం. త్వరలోనే ఈ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తాం." అచ్యుతాపురం ఎంపీడీవో బి. చిన్నారావు" అధికారికంగా హామీ ఇచ్చారు.

**నిరంతర నిఘా ఉంటుంది!**

అధికారులు బ్రిడ్జి పనుల సాకుతో కాలయాపన చేయకుండా, ఎంపీడీఓ ఇచ్చిన హామీ మేరకు తక్షణమే పంచాయతీ సిబ్బంది రంగంలోకి దిగి లోటస్ అపార్ట్‌మెంట్ రోడ్డును క్లీన్ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను ఎంతవరకు పరిష్కరిస్తారో 'విశ్వం వాయిస్' నిరంతరం పర్యవేక్షిస్తుంది!

ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో

## ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, ఆంధ్రుల ఆత్మగౌరవ ప్రతీక, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చి ప్రజల జీవితాల్లో విశేష మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. పేదల సంక్షేమం, మహిళల సాధికారత, తెలుగు ప్రజల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. జయంతి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్యే వేగుల జోగేశ్వరరావుతో కలిసి ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొన్నారు. అనంతరం రామచంద్రాపురం, ముమ్మిడివరం, మండపేట నియోజకవర్గాల్లో నిర్వహించిన మహానాడు వేడుకల్లో పాల్గొని పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేసిన

## తెలుగుదేశం కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు

ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ-మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం వేదికగా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న "హైబ్రిడ్ మహానాడు" కార్యక్రమం సందర్భంగా అమలాపురం నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్ 6, 7, 8లలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్‌ల ద్వారా మహానాడు ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాలను అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు కార్యకర్తలతో కలిసి ఆసక్తిగా వీక్షించారు. మహానాడు వేడుకల్లో భాగంగా క్లస్టర్ 6, 7, 8 పరిధిలో పార్టీ ఎదుగుదలకు, విజయానికి అహర్నిశలు శ్రమించిన పలువురు సీనియర్, ఉత్తమ కార్యకర్తలను ఎమ్మెల్యే ఆనందరావు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పార్టీ కోసం క్రమశిక్షణతో పనిచేసే ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని, సీనియర్ల అనుభవం, యువ కార్యకర్తల ఉత్సాహంతో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ.. సాంకేతికతను వినియోగిస్తూ ప్రతి గ్రామాన్ని, ప్రతి కార్యకర్తను అనుసంధానం చేస్తూ నిర్వహిస్తున్న ఈ హైబ్రిడ్ మహానాడును ఇంత పెద్ద ఎత్తున విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు, నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యక్ష ప్రసంగంలో ఇచ్చిన పిలుపు "గొడ్డలి పార్టీ నెవర్ అగైన్... ఎన్‌డీఏ అగైన్" అనే నినాదం క్లస్టర్ వేదికల వద్ద మారుమోగిందని ఎమ్మెల్యే తెలిపారు. చంద్రబాబు నాయుడు ఈ మాటలు చెప్పినప్పుడు డిజిటల్ స్క్రీన్‌ల ముందున్న కార్యకర్తలు, ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన గొడ్డలి సంస్కృతికి కాలం చెల్లిందని, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఈ మహానాడు ద్వారా మరోసారి స్పష్టమైందని అన్నారు. ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాల్లో క్లస్టర్ల పరిధిలోని ముఖ్య నాయకులు, తెలుగు తమ్ముళ్లు, మహిళలు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని మహానాడు ప్రసంగాలను తిలకించారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవానికి చిరునామా ఎన్టీఆర్

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుజాతి ఆణిముత్యం, పేదల పక్షపాతి, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా పసలపూడి బైపాస్ జంక్షన్ మరియు కొత్తూరులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన తెలుగు ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదు తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా భావించి సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచిన మహోన్నత వ్యక్తిత్వం ఎన్టీఆర్‌దని పేర్కొన్నారు. ప్రజలకు కిలో రెండు రూపాయలకే బియ్యం అందించి ఆకలి బాధలను తీర్చిన మహానేత ఎన్టీఆర్ అని మహిళలకు ఆస్తి హక్కు కల్పించి వారి సాధికారతకు మార్గం చూపారని మంత్రి గుర్తుచేశారు. పేద ప్రజలకు కూడు, గూడు, గుడ్డ అందాలనే లక్ష్యంతో అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా

ఘనంగా నివాళులర్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



నిలిచారని తెలిపారు. సినీ రంగంలో విశ్వవిఖ్యాత నటసార్వభౌముడిగా కోట్లాది అభిమానులను సంపాదించుకున్న ఎన్టీఆర్, రాజకీయాల్లోనూ ప్రజాసేవకు కొత్త దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. తెలుగు జాతి గౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడిగా ఎన్టీఆర్ చరిత్రలో నిలిచిపోతారని మంత్రి సుభాష్ అన్నారు. అనంతరం కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సంక్షేమం అంటే గుర్తొచ్చే మొదటి పేరు ఎన్టీఆర్ అని పేదలకు పక్కా ఇల్లు, జనతా వస్త్రాలు, గురుకుల పాఠశాలలు, మధ్యాహ్న భోజన పథకం, పటేల్ పట్వారి విధానం రద్దు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం మరియు స్త్రీ శక్తిని గుర్తించిన మహోన్నత వ్యక్తి ఆయనేనని అభివర్ణించారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్దేనని మహిళల కోసం ప్రత్యేకంగా పద్మావతి యూనివర్సిటీ స్థాపన మరియు డ్వాక్రా మహిళల వ్యవస్థకు ఆయనే రూపకల్పన చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, సలాది నాయుడు, కడియాల రాఘవన్, కంచుమర్తి బాబురావు, గరికపాటి సూర్యనారాయణ, దంగేటి గౌరీ శంకర్, కట్టా నాగేశ్వరరావు, మేడిశెట్టి సూర్యనారాయణ, గడి గోవిందు, కవల నానాజీ, ఆకుమర్తి చిన్న, మేకా సురేష్, తాలా బత్తుల మురళి, ప్రకాష్, కుడుపూడి ఫణీంద్ర, రెడ్డి సురేష్, వాసంశెట్టి బాల, బుజ్జి, వాసంశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎన్టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# కోలాహలంగా రెండో రోజు మహానాడు

## హాజరైన ఎంపీ హరీష్, ఎమ్మెల్యే వేగుళ్ల - కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న తెలుగు తమ్ముళ్లు

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు రెండో రోజు కార్యక్రమాలు మండపేట నియోజకవర్గంలో కోలాహలంగా సాగింది. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రెండవరోజు వర్చువల్ మహానాడు లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం నియోజకవర్గం లోని 10 క్లస్టర్ లను ఎమ్మెల్యే సందర్శించారు. వర్చువల్ మహానాడు లో పాల్గొన్న వారందిరికి ఏ ఇబ్బంది లేకుండా చూడాలని ఎమ్మెల్యే వేగుళ్ళ నాయకులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్నం నుండి మండపేట పట్టణం లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నందు జరుగుచున్న వర్చువల్ మహానాడులో అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్, అమలాపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు గుత్తుల సాయి, సెక్రటరీ గంధం పల్లంరాజు, మహానాడు కార్యక్రమానికి టీడీపీ అబ్జర్వర్ గా విచ్చేసిన తుమ్మల సునీత తో కలసి ఎమ్మెల్యే వేగుళ్ళ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీకి మహానాడు ఒక పండుగ వంటిదని, ప్రతి కార్యకర్తకు ఇది ఉత్సాహాన్ని నింపే మహోత్సవమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణపై మహానాడులో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది ఇంధన పొదుపు సాంకేతిక వినియోగాన్ని



ప్రోత్సహించే ఉద్దేశంతో వర్చువల్ విధానంలో మహానాడు నిర్వహించడం అభినందనీయమన్నారు. అప్పట్లో దివంగత జి.ఎం.సి బాలయోగి కోనసీమ జిల్లాను అన్ని రకాలుగా అభివృద్ధి పరచరన్నారు. మండపేట నియోజకవర్గం అప్పుడు రాజమండ్రి పార్లమెంట్‌లో ఉండటంతో ఆయన చేసిన అభివృద్ధి మండపేటకు భాగస్వామ్యం కాలేకపోయిందన్నారు. ఇప్పుడు మండపేట నియోజకవర్గం అమలాపురం పార్లమెంట్ లో ఉందని బాలయోగి తనయుడు హరీష్ ఎంపీగా ఉన్నారని తండ్రికి తగ్గ తనయుడిగా మండపేట నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. దీనిపై ఎంపీ హరీష్ మాధుర్ మాట్లాడుతూ తాను ఏ కార్యక్రమం మొదలుపెట్టిన అది మండపేట నుండే మొదలు అవుతుందన్నారు. దానికి ఉదాహరణ గా 2019 ఎన్నికల్లో తన మ్యానిఫెస్టో ను తొలుత మండపేటకే పంపిన విషయాన్ని గుర్తుచేశారు. తప్పకుండా మండపేట అభివృద్ధికి తన సహకారం అందిస్తానన్నారు. తాను ఎక్కడికి వెళ్లిన అక్కడి నాయకులు తమ సమస్యలను చెప్తారని, మండపేటలో ఏ సమస్య వేగుళ్లను దాటి తనదాక రాదన్నారు. ఇటువంటి ఎమ్మెల్యే దొరకటం మండపేట నియోజకవర్గ ప్రజల అదృష్టం గా చెప్పుకొచ్చారు. అనంతరం ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని అమలాపురం పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఉంగరాల రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్ ను కార్యకర్తల సమక్షంలో ఎంపీ హరీష్, ఎమ్మెల్యే వేగుళ్ళ లు కట్ చేసి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానేత ఎన్టీఆర్ అని హరీష్ కొనియాడారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలే తెలుగుదేశం పార్టీకి మార్గదర్శకమని చెప్పారు. ఎన్టీఆర్ రాజకీయాల్లో తీసుకొచ్చిన మార్పులు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. వర్చువల్ మహానాడులో జాతీయ నాయకుల ప్రసంగాలను భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ద్వారా కార్యకర్తలతో కలిసి వీక్షించారు. పార్టీ అభివృద్ధి, రాష్ట్ర సంక్షేమం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై నాయకులు చేసిన ప్రసంగాలు కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయి. అనంతరం అక్కడి నుండి ఏడిదలో జరిగే వర్చువల్ మహానాడులో ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- ⚡ బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- 🗞 రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- 🌎 అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- 📊 విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.

# కల్తీకి జగన్ బ్రాండ్ అంబాసిడర్..

## టీడీపీలో మహిళలకు 33% రిజర్వేషన్ చారిత్రాత్మకం : మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్** : వైసీపీ అధినేత జగన్ రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ వ్యాధి లాంటివాడని అలాగే ఆయన కల్తీకి బ్రాండ్ అంబాసిడర్ అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘాటుగా విమర్శించారు. రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం కోలంక గ్రామంలో నిర్వహించిన మహానాడు రెండో రోజు కార్యక్రమంలో అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్, పార్టీ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, ఇతర ముఖ్య నేతలతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో హైబ్రిడ్ మహానాడు అత్యంత ఉత్సాహభరితంగా జరుగుతోందని మహిళా సాధికారత లక్ష్యంగా టీడీపీ అధిష్టానం పలు కీలక తీర్మానాలు చేయడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే సూపర్ సిక్స్ హామీల్లో స్త్రీ శక్తి పథకం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని గుర్తుచేశారు. ఒకవైపు టీడీపీ మహిళలకు పెద్దపీట వేస్తుంటే మరోవైపు జగన్ తన సొంత తల్లిని, చెల్లిని బయటకు గెంటేసిన పరిస్థితి ఉందని మండిపడ్డారు. జే బ్రాండ్ పేరుతో నకిలీ మద్యం, గంజాయి, అక్రమ మైనింగ్‌లను పెంచి పోషించిన జగన్ రానున్న ఎన్నికల్లో కేవలం ఒకే ఒక్క సీటుకు పరిమితం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. అలాగే పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం అకాల మరణం చెందిన వారి కుటుంబాలకు 5 లక్షల రూపాయల ప్రమాద బీమాను అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి మాట్లాడుతూ రానున్న 2029 ఎన్నికల్లో తమ పార్టీలో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు చేయాలని అధిష్టానం తీర్మానించడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం దీనికోసం ప్రయత్నించినా విపక్షాల వల్ల సాధ్యం కాలేదని కానీ టీడీపీ మహిళా లోకానికి ఇచ్చే గౌరవంగా ఈ ముందడుగు వేసిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో హైబ్రిడ్ మహానాడు రికార్డు స్థాయిలో విజయవంతంగా జరిగిందని స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయ సాధనలో సీఎం చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పార్టీని ముందుకు నడిపిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, నియోజకవర్గ పరిశీలకులు మజ్జి పద్మావతి, స్థానిక పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, వాసంశెట్టి సత్యం ఘనంగా సత్కరించారు. తదనంతరం టి.మామిడాడ, గొల్లపాలెం, వెల్ల గ్రామాల్లో జరిగిన మహానాడు వేడుకల్లో కూడా మంత్రి సుభాష్ పాల్గొని ప్రసంగించారు.

# ఈదురుగాలుల బీభత్సం

### ఆరు గంటల రికార్డు సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించిన విద్యుత్ శాఖ సిబ్బంది
### ట్రాఫిక్‌ను క్లియర్ చేసిన ద్రాక్షారామం ఎస్ఐ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్** : రామచంద్రపురం రూరల్ మండల పరిధిలో గురువారం ఉదయం 11.00 గంటల సమయంలో సంభవించిన భారీ ఈదురుగాలులు, వర్షం కారణంగా విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లినప్పటికీ విద్యుత్ శాఖ సిబ్బంది ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అద్భుతమైన చాకచక్యంతో వ్యవహరించి కేవలం 6గంటల రికార్డు సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. గాలుల ధాటికి అనేక ప్రాంతాల్లో భారీ వృక్షాలు, కొమ్మలు విద్యుత్ లైన్లపై విరిగిపడటంతో మండలంలోని పలు గ్రామాలకు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ముఖ్యంగా రామచంద్రపురం 132 కెవి సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే 33 కెవి ఫీడర్లపై చెట్టు కొమ్మలు, కొబ్బరి ఆకులు, భారీ ఫ్లెక్సీలు ఎగిరివచ్చి పడటంతో హైటెన్షన్ లైన్లు దెబ్బతిన్నాయి. ఈ క్లిష్ట సమయంలో విద్యుత్ శాఖ అధికారులు, లైన్ మెన్లు, సహాయక సిబ్బంది తక్షణమే క్షేత్రస్థాయిలోకి దిగి ప్రతికూల వాతావరణంలోనూ సమిష్టిగా శ్రమించి గంటల వ్యవధిలోనే లైన్లను క్లియర్ చేసి చాలా ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో విజయం సాధించారు. మరోవైపు ద్రాక్షారామ సెక్షన్ పరిధిలోని తాళ్లపొలం, ఆదివారపేట, జెకెపాలెం, ద్రాక్షారామం గ్రామాల్లో ఈ గాలుల ధాటికి సుమారు 18 విద్యుత్ స్తంభాలు నేలమట్టమవగా 6 భారీ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడిపోయాయి. రహదారులపై స్తంభాలు, చెట్లు పడిపోవడంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయిన తరుణంలో సమాచారం అందుకున్న ద్రాక్షారామం ఎస్ఐ గారు తక్షణమే సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయన విద్యుత్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్ అంతటినీ వేగంగా క్లియర్ చేసి రోడ్డును ఖాళీ చేయించారు. అదే సమయంలో విద్యుత్ సిబ్బంది కూడా యుద్ధప్రాతిపదికన అక్కడికి చేరుకుని విరిగిపడిన స్తంభాలను, చెట్లను వేగంగా తొలగిస్తూ కేవలం 4 గంటల వ్యవధిలోనే పనులన్నింటినీ ముమ్మరంగా పూర్తి చేశారు. అలాగే ఆదివారపేట ప్రాంతంలోని 11 కెవి వెంకటాయపాలెం ఫీడర్ పరిధిలో మరో 8 విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో ఆ పరిసర ప్రాంతాల్లో కూడా పనులను వేగవంతం చేసి అనుకున్న సమయానికి పూర్తి చేశారు. ప్రకృతి సృష్టించిన ఇంతటి భారీ విపత్తులోనూ ఏమాత్రం అలసత్వం వహించకుండా ప్రజల ఇబ్బందులను తొలగించడమే లక్ష్యంగా శ్రమించిన విద్యుత్ సిబ్బంది అంకితభావాన్ని, అలాగే సకాలంలో స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించిన ద్రాక్షారామం ఎస్ఐ గారిని స్థానిక ప్రజలు, ఉన్నతాధికారులు ముక్తకంఠంతో ప్రశంసించారు.

### రామచంద్రపురంలో సలగల మధురాజ్ కుటుంబాన్ని

# పరామర్శించిన వైసిపి నేతలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్** : రామచంద్రపురం టౌన్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు సలగల మధురాజ్ నివాసంలో జరిగిన ఆదరణ కూడిక కార్యక్రమంలో వైసిపి ప్రముఖ నేతలు పాల్గొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, రామచంద్రపురం నియోజకవర్గ అబ్జర్వర్ కర్రీ నాగిరెడ్డి గారు ముఖ్య అతిథులుగా విచ్చేసి మధురాజ్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పోలినాటి వర ప్రసాద్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొయ్య బంగారు బాబు, మాజీ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, గుంటముక్కల దొరబాబు గారు, పాటి వర ప్రసాద్, కుడుపూడి భీమశంకరం, గుమ్మళ్ళ రత్నం, బొమ్మ మోహన్ రావు, డేవిడ్ పాల్గొన్నారు. స్థానిక గ్రామ పెద్దలు, వైసిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మధురాజ్ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

### మహానాడు వేళ టీడీపీలోకి

# భారీగా వైసీపీ కార్యకర్తల చేరిక


### మంత్రి సుభాష్, ఎంపీ హరీష్ సమక్షంలో 30 మంది టీడీపీలో చేరిక



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్** : రామచంద్రపురం పట్టణంలోని గుబ్బలవారి పేట ఐదు వార్డులకు చెందిన 30 మంది వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, నియోజకవర్గ పరిశీలకులు మజ్జి పద్మావతి సమక్షంలో వారు టీడీపీ కండువా కప్పుకుని పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారందరినీ నాయకులు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమం సమయంలో పార్టీలో చేరడం శుభపరిణామమని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అతిపెద్ద రాజకీయ కుటుంబంగా అవతరించిందని, కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని అన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న టీడీపీ వైపు ప్రజలు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. టీడీపీలో చేరిన వారిలో దంగేటి వీరభద్రరావు, నున్నబోయిన శ్రీరాములు, నున్నబోయిన అర్జునులు, కుడుపూడి ఆదినారాయణ, పిల్లి గోవిందు, కంచి శ్రీను, కట్ట అర్జున్‌లతో పాటు సుమారు 30 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పట్టణ టీడీపీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, దంగేటి గౌరీశంకర్, వాసంశెట్టి బాల, కట్టా నాగేశ్వరరావు, గుబ్బల వెంకటరమణ, కుడుపూడి ఫణి తేజ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే టీడీపీకి వెన్నెముక

### మహానాడులో సీనియర్ కార్యకర్తలను ఘనంగా సన్మానించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్** : తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం నియోజకవర్గంలో పార్టీకి ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న సీనియర్ కార్యకర్తలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘనంగా సన్మానించారు. కొలంక, టీ మామిడాడ, గొల్లపాలెం, వెల్ల, రామచంద్రపురం గ్రామాల్లో నిర్వహించిన మహానాడు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి, పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన కార్యకర్తలకు శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే అసలైన బలం పునాదులని కొనియాడారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన ప్రతి కార్యకర్త గౌరవానికి అర్హుడని, వారిని సన్మానించుకోవడం తనకు గర్వకారణమని పేర్కొన్నారు. పార్టీ స్థాపన నుంచి నేటివరకు కార్యకర్తల త్యాగాలు, కష్టపడి చేసిన సేవల వల్లే తెలుగుదేశం పార్టీ ప్రజల హృదయాల్లో నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. అనంతరం రామచంద్రపురం క్లస్టర్-1 పరిధిలో పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ, క్లస్టర్ ఇంచార్జి మేడిశెట్టి సూర్యనారాయణ, కో-క్లస్టర్ ఇంచార్జి పదం మూర్తి, మహిళా నాయకుల ఆధ్వర్యంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి సుభాష్ చేతుల మీదుగా భారీ కేక్ కట్ చేసి ఎన్‌టీఆర్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఎన్‌టీఆర్ ఆశయాలను స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గంలో ప్రజాసేవకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పారు.

### మహానాడు వేదికగా కార్యకర్తలకు

# పాదాభివందనం తెలిపిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్** : దేశం గర్వించదగ్గ నాయకుల్లో అన్న ఎన్టీఆర్ అగ్రగామి రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు ఆద్యులు నందమూరి తారక రామారావు సుశిక్షితులైన కార్యకర్తలు ఉండటమే తెలుగుదేశం పార్టీకి శ్రీరామరక్ష అంకిత భావం కల్గిన కార్యకర్తల బలంతోనే తెలుగుదేశం ముందుకు వెళ్తుంది సమాజమే దేవాలయం, పేద ప్రజలే దేవుళ్ళు అనేది తెదేపా సిద్ధాంతం దేశం గర్వించదగ్గ నాయకుల్లో అన్న నందమూరి తారకరామారావు అగ్రగణ్యులని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం, తెలుగు జాతి అభివృద్ధి కోసం, ప్రజల కోసం నిరంతరం ఆలోచించిన ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని ప్రశంసించారు. గురువారం అన్న ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా కొత్తపేట బస్టాండ్ సెంటర్లో మరియు వాడపాలెంలో ఉన్న అన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే బండారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అయన మరియు ఏపీ బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి క్లస్టర్ 6 కాపు కళ్యాణ మండపంలో జరుగుతున్న డిజిటల్ మహానాడుకు తరలి వెళ్లి హాజరు నమోదు చేయించుకున్నారు.డిజిటల్ మహానాడును వీక్షించారు అనంతరం ఆయన మాట్లాడుతు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ కార్యకర్తలు, పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసే మహిళా కార్యకర్తలను గౌరవించమని వారిని సత్కరించుకునే కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా, సంతోషంగా ఉందన్నారు. మహానాడు కి వచ్చిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులకు స్వయంగా ఆయనే భోజనం వడ్డించారు. సమాజమే దేవాలయం, పేద ప్రజలే దేవుళ్ళు అనేది తెలుగుదేశం పార్టీ సిద్ధాంతమన్నారు. కార్యకర్త అధినేత అనేది తెలుగుదేశం పార్టీ విధానమన్నారు. 44 సంవత్సరాలుగా పార్టీ గెలుపు, ఓటములు, ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకొని నిలబడిందంటే అందుకు అంకితభావం కలిగిన కార్యకర్తలే కారణమన్నారు. తెలుగుదేశం పార్టీ బలం, బలగం కార్యకర్తలే అని గుర్తు చేశారు. అనేక సంక్షోభాలు చూసిన తెలుగుదేశం పార్టీ సంక్షోభాలను సైతం అవకాశాలుగా మార్చుకుని ముందుకు వెళ్లడం, అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజల కోసం పనిచేయటం వల్లనే తెలుగుదేశం పార్టీకి ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తూ ఉంటారన్నారు. అందుకే 2024 ఎన్నికల్లో రికార్డు మెజారిటీలతో చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో విజయాలు సాధించడం జరిగిందన్నారు. 56,479 ఓట్ల మెజారిటీతో కొత్తపేట నియోజకవర్గ చరిత్ర ను తనను నాలుగవసారి శాసనసభ్యునిగా గెలిపించిన కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని భావోద్వేగానికి లోనయ్యారు. కార్యకర్తలందరికీ పాదాభివందనం చేస్తున్నానన్నారు. సుశిక్షితులైన కార్యకర్తలు ఉండటమే తెలుగుదేశం పార్టీకి శ్రీరామరక్ష అన్నారు. కార్యకర్తలే కొండంత అండగా నిలవడమే తెదేపా బలమన్నారు. కార్యకర్తలు అందరూ గర్విస్తూ నియోజకవర్గ అభివృద్ధికి, రాష్ట్ర అభివృద్ధికి చేదోడుగా నిలవాలని పిలుపునిచ్చారు. సత్కారం పొందిన కార్యకర్తలందరికీ అభినందనలు తెలియజేశారు.అనంతరం ఆలమూరు మండలం క్లస్టర్ 9,10 మరియు ఆత్రేయపురంమండలం క్లస్టర్-1లో జరిగిన మహానాడు కార్యక్రమంలో అయన పాల్గొన్నారు.

# ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

### నివాళులర్పించిన ఎమ్మెల్యే బండారు, రెడ్డి అనంత కుమారి




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్** : ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు అధిక సంఖ్యలో తరలివచ్చిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు తెలుగుజాతి ఆత్మగౌరవ ప్రతీక, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 103వ జయంతి వేడుకలను నియోజకవర్గ కేంద్రం కొత్తపేటలో అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్ లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి స్థానిక శాసనసభ్యులు బండారు సత్యానందరావు, ఏపీ బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, తెలుగు ప్రజల గుండెల్లో 'అన్నగారు'గా నిలిచిన ఎన్టీఆర్ సంక్షేమ పాలనకు ఆద్యుడని కొనియాడారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ల అనే సిద్ధాంతంతో ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. అనంతరం రెడ్డి అనంత కుమారి మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల రాజకీయ ఎదుగుదలకు ఎన్టీఆర్ చేసిన కృషిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు.

# సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

### మున్సిపాలిటీకి వాటర్ ట్యాంక్ బహుకరణ చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్** : ఆంధ్రుల ఆరాధ్య దైవం, మహానేత నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే మహోన్నత సంకల్పంతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘనంగా ప్రారంభించారు. స్థానిక లయన్స్ క్లబ్ కళ్యాణ మండపం మహానాడు వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, మున్సిపల్ కమిషనర్ కెవిఆర్ రాజు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ పాల్గొని ఈ వాటర్ ట్యాంక్‌ను రామచంద్రపురం పురపాలక సంఘానికి దత్తతగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ లాంఛనంగా వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించి మహిళలకు తాగునీటిని అందించారు. ప్రజల దాహార్తిని తీర్చే దిశగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ఎన్‌టీఆర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవే లక్ష్యంగా వేసవి కాలంలో తాగునీటి సమస్యలను తగ్గించేందుకు ఈ వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేశామని, ప్రజలకు అవసరమైన చోట సేవ చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగుతూ గతంలో కూడా ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక వాటర్ ట్యాంక్‌ను అందజేసి, నీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్న విషయాన్ని పలువురు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న వేసవి సమయంలో ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా నిలిచే ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడంపై స్థానికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఫౌండేషన్ ప్రతినిధులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, మహిళా నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల హృదయాలలో దేవుడు ఎన్టీఆర్ : ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్** : తెరపై రాముడి కృష్ణుడిగా నటనను మెప్పించి పరిపాలనలో ప్రజల హృదయాలు గెలుచుకొని నందమూరి తారక రామారావు దేవుడు అయ్యారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా కొత్తపేట బస్టాండ్ సెంటర్ వద్ద నందమూరి తారక రామారావు విగ్రహానికి బండారు సత్యానందరావు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కాపు కళ్యాణ మండపం వద్ద నిర్వహిస్తున్న డిజిటల్ మహానాడులో సభాస్థలి వద్ద ఉన్న విగ్రహానికి పూలమాలవేసి రెండో రోజు డిజిటల్ మహానాడు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతో రాజకీయాలలో పెనుమార్పులు తీసుకొచ్చి రాజకీయాలలో చైతన్యం తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి నందమూరి తారక రామారావు అని అన్నారు. పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి సంక్షేమానికి పునాదిరాయిగా నిలిచారని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.కొత్తపేటలో జరుగుతున్న డిజిటల్ మహానాడుకు ముఖ్య అతిథులుగా ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఏపీ బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి ప్రధాన కార్యదర్శి గంధం పల్లం రాజు విచ్చేశారు. నూతన అధ్యాయానికి నాంది పలుకుతూ తెలుగుదేశం పార్టీ రెండు రోజులు డిజిటల్ మహానాడును నిర్వహించడం జరిగిందని పార్లమెంటు పరిధిలో ఉన్న ముఖ్య మహానాడులో పాల్గొనడం జరిగిందని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కంఠం శెట్టి శ్రీనివాస్ ముత్యాల బాబ్జి ధర్నాల రామకృష్ణ బూసి జయలక్ష్మి భాస్కరరావు గని శెట్టి వీరేష్ గుబ్బల మూర్తి బీర ఇసాక్ దేవపాటి వెంకటేశ్వరరావు కడలి బీమా సత్తిరాజు ఉషారాణి ఎల్లమెల్లి చంద్రకుమారి తదితర నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.


# బక్రీద్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక

### ముస్లిం సోదరులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ శుభాకాంక్షలు

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్** : బక్రీదు పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని ముస్లిం సోదర సోదరీమణులకు రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, భక్తి, మానవత్వానికి ప్రతీకగా నిలిచే బక్రీదు పండుగ సమాజంలో ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని మంత్రి పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సాహాలతో ఈ పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థిస్తూ బక్రీదు పర్వదినం ప్రతి కుటుంబంలో ఆనందాలు నింపాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆకాంక్షించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన వసతులు..

### 'బడి పిలుస్తోంది' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి : ఎంఈఓలు ఎం.శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి



**విశ్వం వాయిస్ న్యూస్** : బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలలోనే చేరేవిధంగా తల్లిదండ్రులు, ప్రజలంతా ప్రోత్సహించాలని మండల విద్యాశాఖాధికారులు (ఎంఈఓ-1) ఎం. శ్రీనివాస్, (ఎంఈఓ-2) శ్రీమతి వాసంశెట్టి నాగేశ్వరి పిలుపునిచ్చారు. వెల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్లస్టర్ పరిధిలో 'బడి పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా నూతన విద్యార్థుల చేరికల (ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్) పై గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, మరెన్నో అధునాతన సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న ఈ వసతులు, ఉచిత సౌకర్యాల గురించి ఆయా పాఠశాలల పరిధిలోని గ్రామాల్లో ఆటోలకు మైకులు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం చేయాలని వారు ఉపాధ్యాయులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ సమావేశం అనంతరం బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ద్వారా ప్రభుత్వ విద్యా పథకాలు పాఠశాలల్లో అందుతున్న పౌష్టికాహార మెనూ వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం వల్ల పిల్లల భవిష్యత్తుకు లభించే భరోసాను ప్రతి ఇంటికీ చేరవేయడమే లక్ష్యంగా ఈ డ్రైవ్ ముందుకు సాగుతుందన్నారు. ఈ విద్యా చైతన్య కార్యక్రమంలో క్లస్టర్ చైర్మన్ బి. వీరభద్ర రాజు, ఎన్ఎస్ పేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు (హెచ్ఎం) ఉప్పలపాటి మాచిరాజు, అలాగే వెల్ల క్లస్టర్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఎన్టీఆర్ దేశ సేవకు భారతరత్న పురస్కారం ఇవ్వాలి

## మహానాడు 2026లో ఏకగ్రీవ తీర్మానం - విజయవంతమైన ప్రత్తిపాడు మహానాడు

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీకి ఎంతో కీలకమైన వేదికైన మహానాడు 2026 ఓ చారిత్రాత్మక విధాన నిర్ణయాన్ని తీసుకుంది. తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావుకు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్న పురస్కారాన్ని ప్రదానం చేసి గౌరవించాలని ఆయన 103వ జయంతిని పురస్కరించుకుని మహానాడు తీర్మానించింది. మంగళగిరి వేదికగా జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో రాష్ట్ర ప్రజల భవిష్యత్తు, ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధిని ఆకాంక్షిస్తూ మొత్తం 20 కీలక తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. మహానాడు వేదికగా నందమూరి తారకరామారావు వారసత్వం, ఆయన రాజకీయ ప్రభావం మరోసారి ప్రధాన చర్చగా మారింది. మహానాడులో ఆమోదించిన తీర్మానంలో ఎన్టీఆర్ దేశానికి, తెలుగు సమాజానికి చేసిన సేవలను ప్రస్తావిస్తూ ఆయనకు దేశ అత్యున్నత పౌర పురస్కారం ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. పార్టీ శ్రేణులు కూడా ఈ డిమాండ్‌కు ఘన మద్దతు ప్రకటించాయి. ఆయనకు భారత రత్న పౌర పురస్కారాన్ని ఇవ్వాలన్న డిమాండ్ ద్వారా పార్టీ భావోద్వేగ అంశాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నాన్ని పార్టీ విజయవంతం చేసింది. తెలుగు జాతి



ఆత్మగౌరవానికి ప్రతీకైన "మహానాడు 2026" తొలి రోజు విజయవంతంగా కావడంతో రెండో రోజు గురువారం కూడా వర్చువల్ గా హాజరైన 7.5 లక్షల మంది కూడా ఎన్టీఆర్ కు భారత రత్న పౌర పురస్కార ప్రతిపాదనను ఏకగ్రీవంగా ఆమోదించారు. రాష్ట్ర స్థాయిలోని పార్టీ అంశాలు, విషయాలకు తీసి పోకుండా జిల్లాల్లోని నియోజకవర్గాల్లో క్లస్టర్ స్థాయిలో నిర్వహించిన మహానాడు పార్టీ ప్రజల ఆకాంక్షలను ప్రతిఫలిస్తూ విజయవంతంగా ముగిసాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం, శంఖవరం మండలాల్లో మహానాడు జరిగింది. ఏలేశ్వరంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో క్లస్టర్-3 ఇంచార్జి బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలోను, శంఖవరం మండలం అన్నవరంలోని కెకె. ఫంక్షన్ హాలులో క్లస్టర్-7 ఇంచార్జి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు ఆధ్వర్యంలోనూ, అలాగే క్లస్టర్-8 ఇంచార్జి రాష్ట్ర పార్టీ కార్యదర్శి పర్వత సురేష్ ఆధ్వర్యంలోనూ వేర్వేరుగా మహానాడును నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం రాష్ట్ర పార్టీ కార్యదర్శి పర్వత సురేష్ మాట్లాడుతూ... త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని పిలుపు ఇచ్చారు. 2024 అసెంబ్లీ ఎన్నికల విజయాన్ని స్థానిక ఎన్నికల్లోనూ పునరావృతం చేసేలా కూటమి శ్రేణులు కలిసికట్టుగా కృషి చేయాలని ఆయన కోరారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటి చెప్పిన నాయకుడిగా ఎన్టీఆర్ నిలిచి పోయారని ఆయన అన్నారు. పార్టీ స్థాపించిన కేవలం తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి రావడం భారత రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టమని వ్యాఖ్యానించారు. "సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు" అనే ఎన్టీఆర్ సిద్ధాంతం ఇప్పటికీ పార్టీకి మార్గదర్శకమని తెలిపారు. ఎన్టీఆర్ చేసిన సినిమా పాత్రలు, ఆయన వ్యక్తిత్వం మళ్లీ పునరావృతం కావడం అసాధ్యమని సురేష్ కొనియాడారు. మే 28 కేవలం ఎన్టీఆర్ జన్మదినం మాత్రమే కాదని, తెలుగు జాతి ఆత్మ గౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన చారిత్రాత్మక రోజు అని పేర్కొన్నారు." ఎన్టీఆర్ రాజకీయాల్లో కొత్త మార్పుకు శ్రీకారం చుట్టారని, పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే తన లక్ష్యంగా కృషి చేశారని కొనియాడారు. సినీ రంగంలో అపార ఖ్యాతి గడించిన ఎన్టీఆర్, రాజకీయాల్లోనూ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మహానేత అని అన్నారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగు ప్రజలకు కొత్త ఆత్మవిశ్వాసాన్ని అందించిన ఎన్టీఆర్ ఆశయాలను, పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. యువనేత నారా లోకేష్ నాయకత్వంలో పార్టీ మరింత ఆధునిక ఆలోచనలతో ప్రజలకు చేరువవుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల పూర్తి కావస్తున్న సమయంలో స్థానిక సంస్థ ఎన్నికలకు శ్రేణులు సమాయత్తం చేయడంతో పాటు తదుపరి సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం చేసేలా దిశా నిర్దేశం చేశారు.

### బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలో

# రెండో రోజూ ఘనంగా మహానాడు

**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచన మేరకు లారీ యూనియన్ కళ్యాణ మండపంలో మహానాడు–2026 రెండో రోజు వర్చువల్ క్లస్టర్ సమావేశాలు టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.క్లస్టర్–3 ఇన్‌చార్జ్ బొదిరెడ్డి గోపి,పట్టణ పార్టీ అధ్యక్షుడు



మూది నారాయణస్వామి నాయకత్వంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు ముందుగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.వర్చువల్ మహానాడు రెండో రోజు కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ కన్వీనర్లు, కో–కన్వీనర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని మహానాడు కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు,ఎన్టీఆర్ ఆశయాలకు కట్టుబడి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తీర్మానించుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ నగర పంచాయతీ చైర్మన్ అలమండ సత్యవతి చలమయ్య,మీసాల రాజు,వాగు రాజేష్,జొన్నాడ వీరబాబు,ఎండగుడి నాగబాబు, కోణాల వెంకటరమణ,గట్టిం పెద్దకాపు,మామిడి లలిత,రాయుడు చిన్నా,వైభోగుల సుబ్బారావు,రాతికింది సతీష్,పతివాడ అఖిలేష్,జుత్తుల శ్రీను,శంఖాని బాబ్జి,నీలి త్రిమూర్తులు,గొడత రాజాబాబు, సేనాపతి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# పైల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం పట్టణంలో మాలకొండయ్య హాస్పిటల్ దగ్గర ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద దివంగత నేత,తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను టిడిపి సీనియర్ నాయకులు పైల సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా పైల సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్టీఆర్ మహోన్నత వ్యక్తి అని,సినిమా రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలో ప్రవేశించి తెలుగుదేశం పార్టీని స్థాపించి రాజకీయ చరిత్రను తిరగరాసిన వ్యక్తి అని,దేశ రాజకీయాల్లో తనకంటూ ఒక ముద్ర వేసుకున్నారన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ మాలకొండయ్య, మనుమంతు బాబ్జి, సత్తివాడ వీర్రాజు, బూర్లు సత్తిబాబు, కర్రోతు గణేష్, సామన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# క్లస్టర్ 9లో ఘనంగా ముగిసిన మహానాడు వేడుకలు

### ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి : కటకంశెట్టి, పెంకే బాబా

**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు జాతి ఉన్నంతకాలం గుర్తుంచుకుండే నటుడు మహనీయులు, నటసార్వభౌముడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలం నడకుదురు గ్రామం వెలమ కళ్యాణ మండపంలో కటకం శెట్టి బాబీ సారథ్యంలో క్లస్టర్ నైన్ ఇన్చార్జి గండి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



తెలుగుదేశం పార్టీ 44వ మహానాడులో భాగంగా నియోజకవర్గంలోని ఏడు క్లస్టర్లలో పార్టీ శ్రేణులు ఎంతో ఉత్సాహంగా, డిజిటల్ విధానంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి , పెంకే శ్రీనివాస్ బాబా, గండి,వెంకటేశ్వరావు దేవు వెంకన్న మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహనీయుడని కొనియాడారు. 1923, మే 28న నిమ్మకూరులో జన్మించిన ఎన్టీఆర్, వెండితెరపై రాముడు, కృష్ణుడు వంటి పౌరాణిక పాత్రలకు ప్రాణం పోసి తెలుగువారి ఆరాధ్య దైవంగా మారారని ఆయన గుర్తు చేశారు. సుమారు 303 చిత్రాలలో విభిన్న పాత్రలు పోషించడమే కాకుండా, నిర్మాతగా, దర్శకుడిగా తెలుగు సినీ రంగానికి ఆయన అందించిన సేవలు అపారమని పేర్కొన్నారు. కేవలం సినీ ప్రస్థానమే కాకుండా, 13 ఏళ్ల రాజకీయ జీవితంలోనూ ఆయన ఒక ధృవతారగా వెలిగారని వివరించారు. పార్టీని స్థాపించిన తొమ్మిది నెలలకే అధికారాన్ని చేపట్టిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని, తెలుగు భాషకు, జాతికి దేశవ్యాప్త గుర్తింపు తెచ్చిన నాయకుడని కీర్తించారు. ?మహానాడు సందర్భంగా స్థానిక కార్యకర్తలు అన్న ఎన్టీఆర్ సినిమా పాటలకు కార్యకర్తలు నృత్యాలు చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు ప్రత్యేక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, ఆయన ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంక్షేమ పథకాలను నాయకులు గుర్తు చేశారు. స్త్రీలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించడం, బలహీన వర్గాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అందించడం, పేదలకు శాశ్వత గృహాలు నిర్మించి ఇవ్వడం ద్వారా ఆయన నిరుపేదల పాలిట దేవుడిగా నిలిచారని తెలిపారు. పార్టీకి అసలైన బలం కార్యకర్తలేనని, ఎన్టీఆర్ చూపిన బాటలోనే పయనిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని నవ్యాంధ్ర నిర్మాణంలో భాగంగా కూటమి ప్రభుత్వంలో చిన్న చిన్న అవంతరాలు ఉన్న కలిసికట్టుగా ముందుకు పోవాలని తద్వారా మన అదినాయకులు ఆశయాలకు కార్యకర్తలు పునాది అవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా ,క్లస్టర్స్ ఇంచార్జ్ గండి వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులు దేవు వెంకన్న, మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ ఆట్ల గోవిందు, రాష్ట్ర టిడిపి వాణిజ్య విభాగం కార్యదర్శి చీపురుపల్లి జయేంద్రబాబు, గొర్రిపూడి టీడీపీ నాయకులు కానూరి సురేష్,వెలమ సంఘశీ అధ్యక్షులు పోతల గోవిందు, టిడిపి నడకుదురు గ్రామ అధ్యక్షులు యాసలపు విష్ణు మూర్తి, టీడీపీ యువనాయకులు సింగంపల్లి లోవరాజు,మరియు క్లస్టరు ఆరు గ్రామాల టీడీపీ సీనియర్ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# టిడిపిలో మహిళలకు 33% రిజర్వేషన్ అమలు చారిత్రాత్మక నిర్ణయం

## మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్

**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న 2029 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మహిళలకు 33% రిజర్వేషన్లు అమలు చేసేందుకు అధిష్టానం తీర్మానం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. టీడీపీ మహానాడు రెండో రోజు కార్యక్రమంలో భాగంగా కాజులూరు మండలం కోలంక గ్రామంలో అమలాపురం ఎంపీ హరీష్ మాధూర్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం గొల్లపాలెంలో జరిగిన మహానాడులో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండో రోజు మహానాడు ఉత్సాహభరితంగా జరుగుతుం దన్నారు. మహిళలకు పెద్దపీట వేస్తూ అధిష్టానం పలు కీలక తీర్మానాలు చేయడం హర్షనీయమని మంత్రి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు సమాన హక్కులు కల్పించడంతోపాటు సూపర్ సిక్స్ హామీలు విజయవంతంగా అమలు



చేశామన్నారు. స్త్రీ శక్తి పథకం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు పంపిణీ, తల్లికి వందనం వంటి మహిళా సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతుందని, దీనికి విరుద్ధంగా జగన్ తన తల్లిని, చెల్లిని బయటకు గెంటేసిన పరిస్థితి ఉందని ఏద్దేవా చేశారు. వైసీపీకి,టిడిపి పార్టీకి నక్కకు నాగలో కానికి ఉన్నంత తేడా ఉందని చమత్కరించారు. జగన్ రాష్ట్రానికి పట్టిన క్యాన్సర్ వ్యాధి లాంటి వాడని, జే బ్రాండ్ పేరుతో నకిలీ మద్యం, గంజాయి, అక్రమ మైనింగ్ లను పెంచి పోషించారని మ్మడిపడ్డారు. కూటమి ప్రభుత్వం చరిత్రను తిరగరాస్తు 164 సీట్లు సాధిస్తే, జగన్ మాత్రం 154 సీట్ల నుంచి 11 సీట్లకు దిగజారి రికార్డు నమోదు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో 11 సీట్ల నుంచి ఒక సీటుకే పరిమితం అవుతారని జోస్యం చెప్పారు. టిడిపి కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ సభ్యత్వం కలిగిన కార్యకర్త ఎవరైనా అకాల మరణం చెందితే ఐదు లక్షల ప్రమాద బీమా అమలు చేస్తున్నామన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి మాట్లాడుతూ రాష్ట్రంలో 1875 క్లస్టర్లలో విజయవంతంగా హైబ్రిడ్ మహానాడు రికార్డు స్థాయిలో జరిగిందన్నారు. పార్టీ స్థాపించిన తొమ్మిది మాసాల్లోనే అధికారం చేపట్టిన ఎన్టీఆర్ ఆశయ సాధనలో సీఎం చంద్రబాబు నాయుడు, పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నడుస్తున్నారన్నారు. అనంతరం మూడు క్లస్టర్లలోనూ మహానాడు విజయవంతంగా నిర్వహించిన క్లస్టర్ ఇంచార్జ్ లను, పార్టీ నాయకులను మంత్రి సుభాష్ సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, నియోజకవర్గ పరిశీలకులు మజ్జి పద్మావతి, కాజులూరు మండల టిడిపి అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, టీడీపీ అధికార ప్రతినిధి, క్లస్టర్ ఇంచార్జ్ లు వనుం వీరబ్రహ్మాం, కో క్లస్టర్ దడాల సత్తిబాబు, గొల్లపాలెం క్లస్టర్ ఇంచార్జి పలివెల రాజు, కో క్లస్టర్ నల్లాకుల సత్యనారాయణ మూర్తి, క్లస్టర్ ఇంచార్జ్ సలాది సాయిబాబా, టీడీపీ నాయకులు చుంద్రు వీర్రాజుచౌదరి, పేపకాయల బాబ్జి, వెలుగుబంట్ల శ్రీరామ్, టీడీపీ నాయకులు వల్లు అర్జునరావు, కొల్లు వెంకటేశ్వరరావు, ఖండవల్లి శ్రీనివాస్, కోట తాతబ్బాయి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో విషాదం సుడిగాలికి నేలకొరిగిన భారీ వృక్షం

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో అకాల సుడిగాలి బీభత్సం సృష్టించింది. ఉదయం నుంచే తీవ్ర వడగాలులతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు, రాత్రి ఒక్కసారిగా వీచిన బలమైన సుడిగాలులతో భయాం దోళనకు గురయ్యారు. ఈదురుగాలుల ప్రభావంతో పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఈ క్రమంలో పలివెల - కొత్తపాలెం రహదారిపై దారుణ ఘటన చోటుచేసుకుంది. పలివెల వంతెన దాటిన అనంతరం కాలువ పక్కన ఉన్న భారీ వృక్షం ఒక్కసారిగా నేలకొరిగి రోడ్డుపై కూలి పోయింది. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న కొత్తపాలెం గ్రామానికి చెందిన కుడిపూడి వెంకటేష్ బాబు (30) అనే యువకుడు చెట్టు

### యువకుడికి తీవ్ర గాయాలు



కింద చిక్కుకుపోయాడు. బలమైన చెట్టు కొమ్మలు బైక్‌పై పడటంతో వాహనం పూర్తిగా ధ్వంసమైపోయింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, అటుగా వెళ్తున్న ప్రయాణికులు వెంటనే స్పందించి, చెట్టు కొమ్మల మధ్య తీవ్రంగా గాయపడిన వెంకటేష్ బాబును బయటకు తీశారు. అప్పటికే ఆయన తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలో ఉన్నట్లు సమాచారం. అనంతరం అత్యవసర అంబులెన్స్ ద్వారా రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

**రాకపోకలకు తీవ్ర అంతరాయం**

భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో పలివెల - కొత్తపాలెం మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాహనాలు ఇరువైపులా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**ప్రజలకు హెచ్చరిక**

వాతావరణం అకస్మాత్తుగా మారుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. బలమైన ఈదురుగాలులు, సుడిగాలులు వీస్తున్న సమయంలో పెద్ద వృక్షాల కింద నిలబడకూడదని, చెట్లు ఉన్న మార్గంలో ప్రయాణాలు చేయకూడదని, అవసరం అయితే తప్ప ప్రయాణాలు చేయవద్దని హెచ్చరిస్తున్నారు.

# శాంతి త్యాగం ఇస్లాం చూపే మార్గం



### భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేటలో గురువారం భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు నిర్వహించారు. మండపేటలోని జామియా మస్జిద్‌లో నిర్వహించిన ఈదుల్ అదా ప్రత్యేక ప్రార్థనల్లో మస్జిద్ ఇమామ్ ముహమ్మద్ గులాం ముర్షీద్ రజ్వీ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ప్రవక్త హజరత్ ఇబ్రహీం అలైహి సలాం కు స్వప్నం లో కుమారుడిని బలి ఇస్తున్నట్లు ఆ అల్లాహ్ సందేశం ఇస్తరన్నారు. ముసలితనం లో లేక లేక ప్రసాదించిన తన పుత్రుడు హజరత్ ఇస్మాయిల్ ను దైవ మార్గంలో బలి ఇవ్వడానికి సిద్దపడ్డారన్నారు. ఆ ప్రభువు సంతసించి ఆయన స్థానంలో గొప్ప బలి జంతువు ను ఉంచుతారని పేర్కొన్నారు. ఈ ఘట్టం ఇస్లాం లో త్యాగానికి ఉన్న సందేశాన్ని అందజేస్తుందని తెలిపారు. ఆనాటి నుండి ఇస్లాం లో బక్రీద్ పండుగ చేస్తున్నారని తెలిపారు. ఇదే నెలలో ప్రపంచ వ్యాప్తంగా మక్కా నగరంలో ముస్లింలు హజ్ యాత్ర చేస్తారని తెలిపారు. నమాజ్ అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు ఆవరణ లోని శ్మశాన వాటికలో పూర్వీకుల సమాధులు వద్ద ప్రార్థనలు చేశారు.

**గాంధీనగర్ షాధిఖానా వద్ద**

మండపేట గాంధీనగర్ రైతు బజార్ వద్ద నిర్మాణం లో ఉన్న ముస్లిం షాదిఖానా ఉర్దూ ఘర్ లో పెద్ద ఎత్తున బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సైదల్లి పేట లోని హజరత్ హంజా మసీద్ విజయలక్ష్మి నగర్ లోని అక్సా మస్జిద్ , గాంధీనగర్ లోని అల్ అమీన్ మస్జిద్ కు చెందిన వేలాది మంది ముస్లిం లు ఇక్కడ బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల అనంతరం ముస్లిం ఇళ్ల వద్దకు వెళ్లి మేకలు, గొర్రెలు ఖుర్బానీ ఇచ్చారు. వీటి మాంసాన్ని బంధువులు, పేదలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండపేట ముస్లిం లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. షాదీ ఖానా, కలువపువ్వు సెంటర్ లో ఉన్న ప్రసిద్ధ హనఫీ అహలే సున్నత్ వల్ జమాత్ జామియా మస్జిద్ వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
శుక్రవారం, 29 మే 2026
www.viswamvoice.com



# తెలుగు జాతికి గర్వకారణం ఎన్టీఆర్

## - అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్గీయ నటసార్వభౌముడు, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా రాజమహేంద్రవరం నగరంలోని జెఎన్ రోడ్డులోని ఎకెసి కళాశాల పక్కన ఉన్న డాక్టర్ నందమూరి తారకరామారావు మున్సిపల్ పార్కులో ఆయన విగ్రహానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. మహానాడు రెండవ రోజు ఎంతో విశిష్టమైనదని, తెలుగు జాతి అభ్యున్నతి కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని పేర్కొన్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు తెలుగు ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన ప్రాంతీయ పార్టీ టిడిపి మాత్రమేనని తెలిపారు.గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతిందని, పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోవడం, రాజధాని అంశంపై ప్రజలు ఇబ్బందులు పడిన పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. అలాంటి పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని బయటకు తీసుకురావాలనే సంకల్పంతో ప్రజలు కూటమి ప్రభుత్వానికి భారీ మెజారిటీతో పట్టం కట్టారని చెప్పారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో గణనీయమైన వాటా ఆంధ్రప్రదేశ్‌కు రావడం తెలుగువారి సామర్థ్యానికి నిదర్శనమన్నారు. గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థలను విశాఖపట్నంకు తీసుకురావడం, రాయల్ ఎన్ఫీల్డ్ వంటి ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి ఆకర్షించడం చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు.ఎన్టీఆర్ మహిళా సాధికారతకు బాటలు వేసిన మహానేత అని, మహిళలకు ఆస్తి హక్కులు కల్పించడం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయడం వంటి సంస్కరణలు ఆయన ప్రారంభించారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో నారా లోకేష్ మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు దిశగా కృషి చేస్తున్నారని తెలిపారు."కార్యకర్తలే అధినేత" అనే ఎన్టీఆర్ సిద్ధాంతాన్ని టిడిపి నేటికీ కొనసాగిస్తోందని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు కార్పొరేషన్ చైర్మన్ పదవులు, డైరెక్టర్ పోస్టులు, ఎండోమెంట్స్ కమిటీలు, మైనారిటీ కమిటీలు, అర్బన్ సెంటర్స్ తదితర పదవుల్లో పెద్దఎత్తున అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. రాజమహేంద్రవరం నియోజకవర్గానికే సుమారు 300 మంది కార్యకర్తలకు బాధ్యతలు ఇచ్చి నాయకులుగా తీర్చిదిద్దామని వెల్లడించారు.రాష్ట్ర అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ఒక ఇల్లు నిర్మాణం పూర్తయ్యేందుకు సమయం పట్టినట్లే రాష్ట్ర నిర్మాణానికి కూడా సమయం అవసరమని వివరించారు. ప్రజలు సహనం పాటిస్తూ కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. మరొక 15 సంవత్సరాలు చంద్రబాబు నాయకత్వం కొనసాగితేనే ప్రస్తుతం వస్తున్న పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగ అవకాశాలు పూర్తి స్థాయిలో ఫలితాలిస్తాయని తెలిపారు. గత ప్రభుత్వం ఎన్టీఆర్ పేరు వినిపించకుండా చేయాలని ప్రయత్నించిందని, కౌన్సిల్ తీర్మానంతో నిర్ణయించిన "డాక్టర్ నందమూరి తారకరామారావు పార్క్" పేరును మార్చే ప్రయత్నాలు చేశారని విమర్శించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి ఎన్టీఆర్ పేరు పునరుద్ధరించామని చెప్పారు.ఎన్టీఆర్ పేరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని, తెలుగు జాతి ఉన్నంత వరకు ఎన్టీఆర్ పేరు, తెలుగుదేశం పార్టీ చిరస్థాయిగా నిలుస్తాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా

# నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు

**"స్కిల్ గ్యాప్ అసెస్‌మెంట్ డ్రైవ్"కు పారిశ్రామిక వేత్తలకు ఆహ్వానం**

**29న జిల్లా స్థాయిలో కార్యశాల : జేసీ వై.మేఘా స్వరూప్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలతో కూడిన మానవ వనరులను అభివృద్ధి చేయడం, ఉపాధి అవకాశాలను బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న "వన్ డిస్ట్రిక్ట్ - వన్ స్కిల్ విజన్" కార్యక్రమం కింద "స్కిల్ గ్యాప్ అసెస్మెంట్ డ్రైవ్" నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పరిశ్రమల ప్రస్తుత, భవిష్యత్ మానవ వనరుల అవసరాలను గుర్తించేందుకు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు ఈ నెల 29న ఉదయం 10.30 గంటలకు రాజమండ్రి కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పారిశ్రామిక వేత్తలు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, పరిశ్రమల యాజమాన్యాలు, ప్రతిష్టాత్మక సంస్థల ప్రతినిధులు తప్పకుండా హాజరుకావాలని కోరారు. ఆయా పారిశ్రామిక సంస్థల్లో ప్రస్తుతం ఎదుర్కొంటున్న నైపుణ్య మానవ వనరుల కొరత, నియామక సమస్యలు ఉన్న ఉద్యోగ హోదాలు, అవసరమైనసాంకేతిక నైపుణ్యాలు, కొత్తగా ఏర్పడుతున్న నైపుణ్య అవసరాలపై వివరాలు అందించాలని సూచించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కార్యక్రమాల రూపకల్పనకు ఈ సమావేశం ఉపయోగ పడుతుందని తెలిపారు. పరిశ్రమలకు సిద్ధంగా ఉన్న నైపుణ్య మానవ వనరులను తయారు చేయడం, జిల్లాలో ఉపాధి అవకాశాలను పెంపొందించడం ఈ సమావేశ ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామిక వేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని జిల్లా ఉపాధి అధికారి సి. హెచ్. శిరీష కోరారు. సమావేశానికి సంబంధించిన మరిన్ని వివరాలకు, సమావేశంలో భాగస్వామ్యం కావాలనుకునే వారు 7093166121, 9492168132, 7396740041 నంబర్లను సంప్రదించాలని శిరీష విజ్ఞప్తి చేశారు.

### జిల్లా పోలీసు కార్యాలయంలో

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ సీఎం నందమూరి తారక రామా రావు (ఎన్టీఆర్) జయంతిని పురస్కరించుకుని ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి అడిషనల్ ఎస్పీ (ఏ.ఆర్) ఎల్.చెంచిరెడ్డి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భం గా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ... తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్.టి.ఆర్ అన్నారు. సినీరంగంలో అపూర్వ విజయాలను సాధించి, అనంతరం రాజకీయ రంగంలో ప్రవేశించి ప్రజా సేవకు అంకితమై పనిచేశారన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. సమాజ సేవ,క్రమశిక్షణ, ప్రజల పట్ల అంకితభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి (ఎస్.బి) బి.రామకృష్ణ, డి.ఎస్.పి (ఏ.ఆర్) టి.వి.ఆర్.కె కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పేద ప్రజల సంక్షేమ ప్రదాత

# తెలుగు జాతి ఖ్యాతిని దేశ నలుమూలల చాటిన మహానేత ఎన్టీఆర్

**ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలుగుజాతి ఖ్యాతిని దేశ నలుమూలలా చాటిన మహానేత ఎన్టీఆర్ అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. ఎన్టీఆర్ జయంతి వేడుకలు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వాడ వాడలలో వేగుళ్ళ జోగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు నాయకులు కార్యకర్తలు అభిమానులు నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ ను స్మరిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించారు.తొలుత మండపేట నియోజకవర్గ టీడీపీ కార్యాలయం లో ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అక్కడి నుండి ఊరేగింపు గా వాణిమహల్ కరాచీ సెంటర్ కు చేరుకున్నారు. ఇక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల తో మాట్లాడుతూ దేశ రాజకీయాలలో టీడీపీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. అన్న ఎన్టీఆర్ మహిళలకు ఆస్తి హక్కు ఇచ్చిన తరువాత మార్పు మొదలైందని తెలిపారు. సీఎం చంద్రబాబు తీసుకువచ్చిన ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లు మహిళల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని వెల్లడించారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు తీసుకువస్తే కొన్ని పార్టీలు అడ్డుకున్నాయని మండిపడ్డారు. బిల్లుతో సంబంధం లేకుండా టీడీపీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కలిపిస్తూ తీర్మానం చేశారని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి అన్న ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మారుమూల గ్రామం నుంచి వచ్చి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారని.. సినిమాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని కొనియాడారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌమ బిరుదును పొందారన్నారు. ఎన్టీఆర్ 1982లో టీడీపీ పార్టీని స్థాపించారని.. 100 ఏళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీని కూకటివేళ్లతో పెకిలించి విజయం సాధించారని తెలిపారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ముందుకు వెళ్లారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్నారని, మహిళలకు ఆస్తి హక్కు కల్పించారని తెలిపారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో ఏపీ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోందన్నారు. కార్యకర్తల కోసం లోకేశ్ సంక్షేమ నిధిని ఏర్పాటు చేశారన్నారు. హైబ్రిడ్ విధానంలో మహానాడు దిగ్విజయంగా జరుగుతోందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. అనంతరం పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ఎమ్మెల్యే వేగుళ్ళ స్వయంగా మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు మత్స నాగు, అమలాపురం పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, రాష్ట్ర టి.ఎన్.టి.యు.సి అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, కాళ్ళకూరి స్వరాజ్య భవాని, వాకాచర్ల వాసంతి, షేక్ వల్లి జానీ, మలసాని సీతామహాలక్ష్మి, పితాని జ్యోతి, బొడ్డు సత్యనారాయణ, కొవ్వాడ అప్పన్నబాబు, సాదనాల చక్రపాణి, వాకచర్ల గుప్తా, గడి రాంబాబు, కాటా గోపి, పెందుర్తి ప్రదీప్, పిల్లి గణేశ్వరరావు, కడియాల గోవిందు, గండి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితర్లు పాల్గొన్నారు.

# తెలుగు వారి గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించిన నాయకుడు ఎన్టీఆర్

**ఎన్టీఆర్ 103వ జయంతిలో ఎమ్మెల్యే బత్తుల**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు జాతి గౌరవాన్ని యావత్ ప్రపంచవ్యాప్తంగా వెలుగెత్తి చాటిన మహోన్నత నాయకుడు నటసార్వభౌమ విశ్వవిఖ్యాత స్వర్గీయ నందమూరి తారక రామారావు యావత్ తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకొని తెలుగుజాతి ఉన్నంతవరకు వారి హృదయాల్లో నిలచి ఉంటాడని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. బుధవారం రాజానగరం మండలం సూర్యరావుపేటలో స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలు సందర్భంగా బత్తుల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా వెలుగెత్తి చాటిచెప్పిన యుగపురుషుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు.పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూడు,గూడు, గుడ్డ, రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి విప్లవాత్మక పథకాలతో అందరి మనసులో సుస్థిర స్థానం సంపాదించాడని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జనసేన,తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# తులా రంగారావు కుటుంబ సభ్యులకు పలువురు పరామర్శ



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం ద్వారపూడి గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ సర్పంచ్, మాజీ ఏఎంసీ ఛైర్మన్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తులా శ్రీ రంగారావు మరణం పట్ల పలువురు రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనపర్తి నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు మావయ్య అయిన రంగారావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనపర్తి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త రావాడ నాగు, పలు పార్టీల నాయకులు నాగిరెడ్డి రాంబాబు, ఈదల వీరాస్వామి, శెట్టి నాగేశ్వరరావు, మండ వీరభద్రరావు, పొలినాటి సత్యనారాయణ, కానూరు రాము, అడబాల బాబ్జి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### రాజంపేటలో బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో

# ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం రాజంపేట గ్రామంలో తెలుగు జాతి ఆత్మగౌరవ ప్రతిక తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న నందమూరి తారకరామా రావు(ఎన్టీఆర్) జయంతి వేడుకలు రూడా చైర్మన్, తూర్పు గోదావరి జిల్లా టి.డి.పి. పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గం ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలతో కలసి ఘనంగా నిర్వహించారు. తొలుత అన్నగారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకై నిరంతరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

### మునికూడలి పుష్కర ఘాట్‌ను

# 'మోడల్ ఘాట్'గా తీర్చిదిద్దాలి

**ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ**



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గంలో రాబోయే పుష్కరాల ఏర్పాట్లు, ఘాట్ల అభివృద్ధి మరియు వేసవి కాలంలో నీటి సరఫరాపై రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ గురువారం రాజానగరం కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా (ఆర్ డబ్ల్యు ఎస్) శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం నియోజకవర్గంలో జరుగు తున్న వివిధ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ఉన్నతాధికారుల అనుమతి కోసం కొన్ని ప్రత్యామ్నాయ ప్రతిపాద నలను సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.మునికూడలి ఘాట్‌ను మోడల్ పుష్కర్ ఘాట్ గా అభివృద్ధి చేయాలని,రాష్ట్ర ఉపముఖ్య మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు, మునికూడలి పుష్కర ఘాట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా మోడల్ పుష్కర్ ఘాట్ గా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు, ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని ఎమ్మెల్యే అధికారులకు స్పష్టం చేశారు.పుష్కర ఘాట్లలో యాత్రికులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని, నియోజకవర్గంలో ప్రతిపాదించిన 13 పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు, యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని,ముఖ్యంగా పుష్కర రేవుల వద్ద తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని. ఎక్కడా పారిశుధ్య లోపం తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ఘాట్లలో తాగునీరు మరియు పారిశుధ్య సదుపాయాల కొరకు రూ. 4.52 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

# తెలుగు జాతి ఆత్మగౌరవం చాటిన వ్యక్తి ఎన్టీఆర్



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తేదేపా వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం అధికారికంగా నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి వై.ఎన్.ఎన్.గోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ తొలుత చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎన్టీఆర్ రాష్ట్రానికి, తెలుగు ప్రజలకు చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన కృషి, పేద ప్రజల సంక్షేమానికి అమలు చేసిన పథకాలు నేటికీ ఆదర్శంగా నిలుస్తాయని పాల్గొన్న అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తేదేపా కార్యకర్తలు, డిప్యూటీ ఎంపీడీవో వి.వి.ఆర్.కృష్ణం రాజు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రతి కార్యకర్త ఇదే ఉత్సాహంతో

# స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేయాలి : బొడ్డు

**ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు**





**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్త ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. గురువారం మహానాడు రెండో రోజు బొడ్డు నియోజకవర్గంలోని అన్ని క్లస్టర్లకు వెళ్లి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి కార్యకర్తలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం బొడ్డు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి,సంక్షేమంతో పాటు స్త్రీ స్వయం ప్రతిపత్తి, యువతకి ఉపాధి ధ్యేయంగా మహానాడులో తీర్మానాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. సుమారు రెండువేల ప్రాంతాలలో మహానాడు జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా 72 క్లస్టర్లు, నియోజకవర్గ వ్యాప్తంగా బొడ్డు ఆధ్వర్యంలో 10 క్లస్టర్లలో ప్రతి కార్యకర్త సమర్థవంతగా పనిచేసి మహానాడు జయప్రదం చేశారని అభినందించారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో చురుకైన పాత్ర పోషించి అన్నిచోట్ల పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. పార్టీకి విశేష సేవలు అందించి స్వర్గస్తులైన పార్టీ కార్యకర్తల ఆత్మశాంతికి మౌనం పాటించారు. పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న సీనియర్ నాయకులలు కంటే నాగ కేశవరావు, బుడ్డిగా సూర్యారావు, సిహెచ్ వెంకటరమణ, బత్తుల శేషుబాబు, వల్లేపల్లి దుర్గారావు, కొండేటి ధర్మరాజు, మారిశెట్టి రమణ, కర్రి రాజారావు,మార్ని సురేష్ పూలమాలవేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం క్లస్టర్ ఇన్చార్జిలు అడపా వీరబాబు, రొంగల శ్రీనివాస్, దిడ్డి మాధవరావు మహానాడును విజయవంతం చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కంటే నాగ కేశవరావు, దూది కాంతారావు, మార్ని రాము, సూదిన గంగాధర్, కంటే గణపతి, పుప్పాల వెంకటరత్నం, కొయ్యే సామ్యూల్, తేలగంశెట్టి శ్రీనివాస్, పరస శ్రీనివాస్, పీతా శ్రీనుబాబు, పెదపాటి భీమరాజు, గుర్రం శ్రీనివాస్, కోర్పు రాజేష్, గండి రమేష్, తెదేపా నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ 'పంజా' రీ-రిలీజ్ పోస్టర్ ఆవిష్కరణ : బత్తుల




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉపముఖ్యమంత్రి వర్యులు, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని(సెప్టెంబర్ 2) పురస్కరించుకుని ఆయన నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'పంజా' రీ-రిలీజ్ సందర్భంగా గోడ పత్రికను రాజానగరం శాసనసభ్యులు బలరామకృష్ణ ఆవిష్కరించారు. బుధవారం రాజానగరం జనసేన పార్టీ కార్యాలయంలో పంజా చిత్రం ప్రత్యేక పోస్టర్‌ను ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, పవన్ కళ్యాణ్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.





### ఎన్టీఆర్, ప్రభాస్‌లతో

# బ్లాక్ బస్టర్ హిట్స్..

### అప్పుడు కుర్రాళ్ల ఆరాధ్య దేవత.. ఇప్పుడు ఇలా..

గ్లామర్ ఫీల్డ్‌లో టాలెంట్‌తో పాటు కాస్త 'లక్' కూడా తోడవ్వాలి. మొదటి సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్‌డమ్ తెచ్చుకుని, ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసినా కూడా సరైన సక్సెస్ లేక వెనకబడిపోయిన హీరోయిన్లు టాలీవుడ్‌లో చాలా మంది ఉన్నారు. అందులో ఈ ముద్దుగుమ్మ ఒకరు. ఒకప్పుడు ఆమె కుర్రాళ్ల ఆరాధ్య దేవత. తక్కువ సమయంలోనే తనదైన ముద్ర వేసింది. చార్మీ కౌర్.. ఈ పేరు వినగానే కుర్రకారుకు ఒకప్పుడు నిద్రలేకుండా చేసిన అందాల భామ గుర్తుకొస్తుంది. 'నీతో', 'శ్రీ ఆంజనేయం' వంటి సినిమాలతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ పంజాబీ ముద్దుగుమ్మ, అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. తనదైన నటనతోనే కాకుండా, గ్లామర్‌తోనూ ప్రేక్షకులను కట్టిపడేసిన చార్మీ, తాజాగా లేటెస్ట్ ఫోటోతో సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. సాధారణంగా సెలబ్రిటీల చైల్డ్‌హుడ్ ఫోటోలు లేదా కెరీర్ ప్రారంభంలో దిగిన ఫోటోలు నెట్టింట వైరల్ అవ్వడం సహజం. అయితే ఇప్పుడు వైరల్ అవుతున్న చార్మీ ఫోటో చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. అందులో ఆమె చాలా అమాయకంగా, ఇప్పటి రూపానికి పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. "ఈ ఫొటోలో ఉన్న హీరోయిన్ ఎవరో గుర్తుపట్టారా?" అంటూ సాగుతున్న ఈ పోస్ట్ సోషల్ మీడియాలో తెగ షేర్ అవుతోంది. ఒకప్పుడు ప్రభాస్, ఎన్టీఆర్, రవితేజ, వెంకటేశ్, నాగార్జున వంటి స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకుంది. నటనకు ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఎంచుకుంటూ నటిగా తనదైన ముద్ర వేసింది. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే ఊహించని విధంగా సినిమాలకు గుడ్ బై చెప్పేసింది. తాజాగా ఈ అమ్మడు లేటెస్ట్ లుక్స్ చూసి ఫ్యాన్స్ షాకవుతున్నారు. అందులో అసలు గుర్తుపట్టలేనంతగా మారిపోయి కనిపిస్తుంది. ప్రస్తుతం చార్మీ సినిమాల్లో నటించకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన జిమ్ వర్కవుట్స్, వెకేషన్ ఫోటోలు, సినిమా అప్‌డేట్స్‌ను ఎప్పటికప్పుడు పంచుకుంటుంది. తాజాగా వైరల్ అవుతున్న ఆమె పాత ఫోటోను చూసి "అప్పుడు ఇప్పుడు కూడా చార్మీ ఎంతో క్యూట్‌గా ఉంది" అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఏదేమైనా, టాలీవుడ్ తెరపై తనకంటూ ఒక ప్రత్యేక పేజీని లిఖించుకున్న ఈ 'మంత్ర' బ్యూటీ, నేటికీ వార్తల్లో నిలుస్తూనే ఉంది.

### యాంకర్ సుమ ఒక్కో షోకి

# ఎంత తీసుకుంటుందో తెలుసా?

### నెల సంపాదన తెలిస్తే మతిపోవాల్సిందే..



ప్రస్తుతం టాలీవుడ్ లో నంబర్ వన్ యాంకర్ ఎవరంటే అందరూ సుమ కనకాల పేరే చెబుతారు. అందులో ఎలాంటి అనుమానమే లేదు. అయితే సుమ రెమ్యునరేషన్స్, అలాగే ఆమె నెల, ఏడాది సంపాదనల గురించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికర చర్చ జరుగుతోంది. తెలుగు బుల్లితెరపై మకుటం లేని మహారాణిగా వెలుగొందుతోంది సుమ కనకాలు. పేరుకు మలయాళీ అయినా స్వచ్ఛమైన తెలుగు ఉచ్చారణ, సమయానికి తగ్గట్టుగా మాటలు, డైలాగులు, చమత్కార పంచులు వెరసి ఆమెను నెంబర్ వన్ యాంకర్‌గా నిలబెట్టాయి. ఆమె తర్వాత చాలా మంది కొత్త యాంకర్లు వచ్చినా, సుమలాగా క్రేజ్ తెచ్చుకోలేకపోయారు. టీవీ షోస్, ప్రోగ్రామ్స్, నిమా ప్రీ రిలీజ్ ఈవెంట్లు, ఆడియో ఫంక్షన్లు, సక్సెస్ మీట్లు, టెలివిజన్ షోలు, స్పెషల్ ఇంటర్వ్యూలు, అవార్డు వేడుకలు.. ఇలా ఏది కావాలన్నా యాంకర్ సుమ ఉండాల్సిందే. ముఖ్యంగా ఈ మధ్యన ఏ సినిమా ఈవెంట్ చూసినా సుమనే కనిపిస్తోంది. చిన్న హీరోల నుంచి స్టార్ హీరోల సినిమా ఈవెంట్లను కూడా సుమనే హోస్టింగ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యాంకర్ సుమ రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. సినిమా ఈవెంట్ల విషయానికి వస్తే, ఒక ప్రీ మూవీ రిలీజ్ ఈవెంట్, ఆడియో లాంచ్ లేదా సక్సెస్ మీట్‌కు సుమ రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు పారితోషికం తీసుకుంటోందట. ఇక సినిమా ప్రమోషన్లలో భాగంగా హీరో, హీరోయిన్లతో ఒక్కో ఇంటర్వ్యూకే రూ.3 లక్షల వరకు ఛార్జ్ చేస్తోందట. టీవీ ప్రసారమవుతున్న సుమ అడ్డా వంటి కార్యక్రమాల ద్వారా ఆమెకు భారీ ఆదాయం వస్తోందని తెలుస్తోంది. ఒక్కో ఎపిసోడ్‌కు రూ.2.5 లక్షల వరకు అందుకుంటున్నారని సమాచారం. ఇక ఈవెంట్‌లు, ప్రైవేట్ ఫంక్షన్‌లు, అవార్డు వేడుకలు తదితర ప్రత్యేక కార్యక్రమాలకు ఒక్కో ఈవెంట్ కు రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షల వరకు తీసుకుంటోందట సుమ.

### బుడ్డోడి ఎఫెక్ట్..

## హైదరాబాద్ ఘోర పరాజయం..

# క్వాలిఫైయర్ 2కి రాజస్థాన్



ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత ఉత్కంఠభరితమైన దశకు చేరుకుంది. ముల్లన్‌పూర్ వేదికగా జరిగిన ఎలిమినేటర్ పోరులో రాజస్థాన్ రాయల్స్ జట్టు చెలరేగి ఆడి సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 47 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ ఓటమితో ఆరెంజ్ ఆర్మీ టోర్నీ నుండి నిష్క్రమించగా, రాజస్థాన్ తన టైటిల్ వేటను కొనసాగిస్తోంది. ఐపీఎల్ ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ ఘన విజయం సాధించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు 244 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడంలో ఘోరంగా విఫలమైంది. 19.2 ఓవర్లలో 196 పరుగులకు ఆరెంజ్ ఆర్మీ ఆలౌట్ అయ్యింది. దీంతో రాజస్థాన్ క్వాలిఫైయర్ 2కి చేరింది. గుజరాత్ టైటాన్స్ జట్టుతో తదుపరి మ్యాచ్ ఆడనుంది. అంతకుముందు ముల్లన్‌పూర్‌లోని మహారాజా యాదవేంద్ర సింగ్ స్టేడియంలో మొదట బ్యాటింగ్ చేసిన రాజస్థాన్, 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ అవుటయ్యారు. పాట్ కమిన్స్‌ను సుశాంత్ మిశ్రా, నితీష్ రెడ్డిని రవీంద్ర జడేజా, స్మారక్ రవిచంద్రన్‌ను నాంద్రే బర్గర్, హెన్రిచ్ క్లాసెన్‌ను యశ్ పుంజా పెవిలియన్ చేర్చారు.

**సూర్యవంశీ కేవలం 29 బంతుల్లో 97 పరుగులు .. గేమ్ మార్చిన బుడ్డోడు..**

వైభవ్ సూర్యవంశీ కేవలం 29 బంతుల్లో 334.48 స్ట్రైక్ రేట్‌తో 97 పరుగులు సాధించాడు. అతను ఈ ఇన్నింగ్స్‌లో 12 సిక్సర్లు, 5 ఫోర్లు కొట్టాడు. క్రిస్ గేల్ 14 ఏళ్ల క్రితం నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టి, ఒకే ఐపీఎల్ సీజన్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాట్స్‌మన్‌గా కూడా వైభవ్ నిలిచాడు. గేల్ 2012లో 59 సిక్సర్లు కొట్టగా, సూర్యవంశీ ఈ సీజన్‌లో ఇప్పటికే 65 సిక్సర్లు బాదాడు.

**ముగిసిన సన్‌రైజర్స్ ప్రయాణం..**

ఈ ఓటమితో 2026 ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్రయాణం ముగిసింది. ఎలిమినేటర్ మ్యాచ్‌లో గెలిచి తదుపరి దశకు వెళ్లాలనుకున్న అభిమానుల ఆశలపై రాజస్థాన్ రాయల్స్ నీళ్లు చల్లింది. ఈ విజయం రాజస్థాన్ జట్టులో కొత్త ఉత్సాహాన్ని నింపగా, సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ తమ వైఫల్యాలపై సమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తానికి, ముల్లన్‌పూర్ వేదికగా జరిగిన ఈ హై-వోల్టేజ్ పోరులో రాజస్థాన్ రాయల్స్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడి విజయాన్ని అందుకుంది. సన్‌రైజర్స్ పోరాడినప్పటికీ భారీ లక్ష్యం ముందు తలవంచక తప్పలేదు. రాజస్థాన్ రాయల్స్ తదుపరి పోరులో ఎలాంటి ప్రదర్శన ఇస్తుందో వేచి చూడాలి.

### పరాగ్ సిగరెట్ గొడవతో మొదలై..

# ఐపీఎల్‌లో హనీ ట్రాప్ కలకలం..




ఐపీఎల్ 2026 సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ.. తెరవెనుక వివాదాలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా మీడియా సమావేశంలో ఉపయోగించిన హనీ-ట్రాప్ అనే పదం క్రికెట్ వర్గాల్లో పెద్ద దుమారానికి కారణమైంది. ఈ వ్యాఖ్యలు బయటకు రాగానే సోషల్ మీడియాలో రకరకాల పుకార్లు షికారు చేశాయి. కొందరు ఆకతాయిలు ఏకంగా ఐపీఎల్ క్రికెటర్ల భార్యలు, పార్ట్‌నర్లను టార్గెట్ చేస్తూ ట్రోలింగ్, వేధింపులకు దిగడంతో గందరగోళ వాతావరణం నెలకొంది. ఈ వివాదంపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తాజాగా స్పందిస్తూ కీలక వివరణ ఇచ్చారు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్లో ఎలాంటి హనీ-ట్రాపింగ్ ఉదంతాలు తమ దృష్టికి రాలేదని ఆయన స్పష్టం చేశారు. ఐపీఎల్ అనేది అత్యంత పారదర్శకంగా, స్వచ్ఛంగా సాగుతున్న టోర్నమెంట్ అని, ఇలాంటి లేనిపోని పుకార్లను నమ్మవద్దని ఆయన అభిమానులను కోరారు. అయితే ఈ సీజన్లో ఆటగాళ్లు, సపోర్ట్ స్టాఫ్, ఫ్రాంచైజీల మేనేజ్‌మెంట్ వైపు నుంచి కొన్ని క్రమశిక్షణా ఉల్లంఘనలు, ప్రోటోకాల్ వివాదాలు జరిగిన మాట నిజమేనని బీసీసీఐ అంగీకరించింది. ఇలాంటి సంఘటనలను ముందే అరికట్టకపోతే టోర్నమెంట్‌తో పాటు బోర్డు ప్రతిష్టకు భంగం వాటిల్లుతుందని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా 10 ఐపీఎల్ ఫ్రాంచైజీల సీఈఓలకు ఒక సుదీర్ఘమైన హెచ్చరిక లేఖ రాశారు. ఆటగాళ్ల భద్రత, లీగల్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని అపరిచిత వ్యక్తులను హోటల్ గదుల్లోకి రానివ్వకూడదని, యాంటీ కరప్షన్ ప్రోటోకాల్స్ కచ్చితంగా పాటించాలని అందులో ఆదేశించారు. లీగ్ సాఫీగా సాగుతోందని చెబుతూనే, రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరెట్ లేదా వేపింగ్ చేసిన ఉదంతాన్ని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ ప్రస్తావించారు. టీవీ లైవ్ బ్రాడ్‌కాస్ట్‌లో రియాన్ పరాగ్ వేప్ పట్టుకుని కనిపించడంపై దేశవ్యాప్తంగా విమర్శలు వచ్చాయి. ఇలాంటి చిన్నపాటి సంఘటనలను మనం ముందే నివారించాల్సి ఉండాల్సిందని, ఆ ఒక్క వివాదం మినహా ఈ సీజన్లో ఎలాంటి పెద్ద తప్పులు జరగలేదని ఆయన అన్నారు. సెక్రటరీ దేవజిత్ సైకియా చేసిన నిర్దిష్ట వ్యాఖ్యల గురించి తనకు పూర్తి సమాచారం లేదని, దానిపై ఆయనే మాట్లాడాలని ధుమాల్ పేర్కొన్నారు. వివాదాలను పక్కనబెడితే, ఆట పరంగా ఐపీఎల్ 2026 సీజన్ అత్యంత అద్భుతంగా సాగిందని ఐపీఎల్ చైర్మన్ కొనియాడారు. మునుపటి సీజన్ల లాగే, ఈసారి కూడా లీగ్ స్టేజ్ చివరి రోజు వరకు ఏ ఏ నాలుగు జట్లు ప్లే-ఆఫ్స్‌కు క్వాలిఫై అవుతాయో ఎవరికీ అర్థం కాలేదని, అదే ఐపీఎల్ కి ఉన్న అసలైన బ్యూటీ అని ఆయన అన్నారు. మ్యాచ్‌ల క్వాలిటీ, ఆటగాళ్ల ప్రదర్శన ఈసారి నెక్స్ట్ లెవెల్‌లో ఉందంటూ ఆయన హర్షం వ్యక్తం చేశారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com